




సోమశిలకు 29,588 క్యూసెక్కుల వరద

అనంతసాగరం(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 29,588 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 74.400 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు గేట్ల ద్వారా 29,650, పవర్ టెన్నల్ నుంచి 2600, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

స్కూళ్లకు కొత్త టీచర్లు

మెగా డీఎస్సీ-2025 తుది జాబితాను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. దీంతో జిల్లాలో ఉపాధ్యాయుల కొలువుల జాతర ప్రారంభమైంది. నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆనందాన్ని నింపుతూ జిల్లాలో 673 పోస్టులకు గానూ, 657 పోస్టులను భర్తీ చేయనున్నారు. వివిధ కారణాల కారణంగా 16 ఖాళీల భర్తీకి తాత్కాలిక బ్రేక్ వేసినట్లు అధికారులు ప్రకటించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంతోపాటు కలెక్టరేట్‌లో డీఎస్సీ తుది జాబితాను ప్రదర్శనకు ఉంచారు. అలాగే డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ ఏపీడీఎస్సీ డాట్ ఏపీ సీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్ సైట్‌లో కూడా అభ్యర్థుల ఎంపిక జాబితా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు.

- మెగా డీఎస్సీ తుది జాబితా విడుదల
- జిల్లాలో 657 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ
- 16 ఖాళీల భర్తీకి తాత్కాలిక బ్రేక్
- డిసెంబరులో భర్తీకి అవకాశం



నెల్లూరు(విద్య), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో జిల్లాలో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పోటీ పడ్డారు. ఈ నియామకాల్లో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లతోపాటు సబ్ క్లాసిఫికేషన్, స్పోర్ట్స్ కోటా 3శాతాన్ని కూడా అమలు చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల పరిధిలోని ఉపాధ్యాయ ఖాళీలతోపాటు గిరిజన, సాంఘిక సంక్షేమశాఖలు, మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసేలా పోస్టులను సిద్ధం చేశారు. వీరితోపాటు మోడల్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, దివ్యాంగుల పాఠశాలలు, జువైనల్ పాఠశాలల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం కంప్యూటర్ బేస్‌డ్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించారు. అన్ని అభ్యంతరాల పరిశీలన అనంతరం, తుది జాబితాను సోమవారం విడుదల చేశారు. వీరందరికీ ఈనెల 19న సీఎం నారా చంద్రబాబునాయుడు, డీసీఎం పవన్‌కళ్యాణ్‌ల చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. అనంతరం వారికి దసరా సెలవుల సమయంలో (ఈనెల 22 నుంచి 29 వరకు) జిల్లాలోనే ప్రత్యేక శిక్షణ అందించి ప్లేస్ ఆఫ్ పోస్టింగ్ కూడా అందచేయనున్నారు.

● అభ్యర్థులు డీఈవోకి రిపోర్టు చేయాలి

మెగా డీఎస్సీ-2025 తుది జాబితాలో ఎంపికైన అభ్యర్థులు ఈనెల 18న సాయంత్రం 5 గంటలకు వెంకటాచలం మండలంలోని గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయ ట్రస్ట్ వద్ద తనకు తప్పనిసరిగా రిపోర్టు చేయాలని డీఈవో ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులతో పాటు ఓ సహాయకుడు కూడా హాజరు కావాలన్నారు. అభ్యర్థులంతా వారికి అవసరమైన సామగ్రిని సమకూర్చుకున్న అనంతరం వారికి ఐడీ కార్డులు అందచేస్తామన్నారు. ఈ ఐడీ కార్డులు తీసుకుని ఈనెల 19న విజయవాడలో జరిగే సీఎం కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. అభ్యర్థులందరినీ ప్రత్యేక బస్సుల ద్వారా విజయవాడకు తీసుకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాబట్టి తప్పనిసరిగా రిపోర్టు చేయాలని ఆయన తెలిపారు.

డిసెంబరులో మళ్లీ నోటిఫికేషన్

జిల్లాలోని అన్నీ మేనేజ్‌మెంట్ స్కూళ్లలో భర్తీ చేసిన పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఇంగ్లిష్ 83, హిందీ 18, తెలుగు 31, ఉర్దూ 5, బయాలజీ 62, మ్యాథ్స్ 64, ఫిజికల్ డైరెక్టర్లు 105, ఫిజికల్ సైన్స్ 75, సోషల్ 101 పోస్టులు ఉన్నాయి. అలాగే ఎస్‌జీటీ తెలుగు 109, ఉర్దూ పోస్టులు 4 కలిపి మొత్తం 657 భర్తీ అయ్యాయి. అలాగే ఎస్ఏ ఇంగ్లిష్ 2, తెలుగు 1, ఉర్దూ 2, ఫిజికల్ డైరెక్టర్స్ 2, ఫిజికల్ సైన్స్ 1, సోషల్ 2, బయలాజికల్ సైన్స్ 1, హిందీ 1, ఎస్‌జీటీ తెలుగు 1, ఉర్దూ 3 పోస్టులు కలిపి మొత్తం 16 పోస్టులు క్యారీ ఫార్వర్డ్ ఖాళీలుగా మిగిలాచి. వీటితో పాటు కొత్తగా ఏర్పడే ఖాళీలను కలిపి ఈ ఏడాది డిసెంబరులో విడుదల చేసే డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

- మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు
- బీట్ వ్యవస్థను పటిష్టం చేస్తాం
- ఎస్పీ అజిత బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల పేర్కొన్నారు. జిల్లా ఎస్పీగా సోమవారం ఉదయం 9.50 గంటలకు పోలీసు కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ శాంతిభద్రతలు, నేరనియంత్రణ, నేర పరిశోధన, మహిళల సంరక్షణ, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై దృష్టి సారించి, కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. మారుతున్న సాంకేతికతను బట్టి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపడతామని, మహిళలు, బాలికల పట్ల జరుగుతున్న నేరాల నియంత్రణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రౌడీ షీటర్లు, నేరచరిత గల వారిపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచుతామని చెప్పారు. ఈగల్ బృందం సమన్వయంతో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. నేర నియంత్రణకు బీట్ వ్యవస్థను మరింతగా పటిష్టం చేస్తామని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెంపొందించేలా సమర్థవంతంగా సేవలు అందచేస్తామని ఆమె తెలిపారు.

● దర్గామిట్ట స్టేషన్ తనిఖీ

బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ఎస్పీ అజిత నగరంలోని దర్గామిట్ట పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ మ్యాప్, చార్ట్, రిసెప్షన్ గది, స్టేషన్ పరిధిలోని నేర, శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించారు. గత మూడేళ్ల కాలంలో క్రైం ఏవిధంగా ఉందో రికార్డులు పరిశీలించి, నేరాల నియంత్రణకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర డీఎస్పీ సింధుప్రియ, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య, ఎస్‌బీ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా మెరుగుపడాలి..!

- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తొలిరోజు జిల్లాల ప్రగతిపై చర్చ
- తొలి క్వార్టర్‌లో జిల్లా జీడీపీ 18.65 శాతంగా నమోదు
- ఇది రాష్ట్ర సగటు కన్నా తక్కువే...
- ఆయా రంగాల్లో కీలక అంశాలపై దిశానిర్దేశం

నెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల నాలుగో కాన్ఫరెన్స్ సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమంలో తొలిరోజు రాష్ట్ర, జిల్లాల ప్రగతిపై చర్చించారు. ఏయే రంగాల్లో పురోగతి మెరుగ్గా ఉంది...? ఇంకా ఏయే రంగాల్లో పురోగతి మెరుగుకు చర్యలు తీసుకోవాలి...? వంటి అంశాలపై సీఎంతోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్(ఏప్రిల్-జూన్) ప్రగతి నివేదికలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం జిల్లా ఇంకా పలు రంగా ల్లో మెరుగుపడాల్సి ఉంది. 2025-26లో జిల్లా జీడీపీ లక్ష్యం రూ.92,705 కోట్లుగా పెట్టుకున్నారు. ఈ ఏడాది 16.56 శాతం గ్రోత్ రేటు పెంపు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. తొలి త్రైమాసికంలో జిల్లా రూ.17,294 కోట్ల జీడీపీని సాధించి 16వ స్థానంలో నిలిచింది. నిర్దేశించుకున్న లక్ష్యంలో ఇది 18.65 శాతంతో సమానం. రాష్ట్ర సగటుతో పోలిస్తే జిల్లా సాధించిన ప్రగతి తక్కువ. రాష్ట్రం మొత్తం సరాసరి చూసుకుంటే తొలి త్రైమాసికంలో 19.18 శాతం జీడీపీ అచీవ్ అయ్యింది. అంటే జిల్లా రానున్న మూడు త్రైమాసికాల్లో 81.35 శాతం లక్ష్యం సాధించాల్సి ఉంది.



కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

రంగాల వారీగా చూసుకుంటే..

వ్యవసాయ రంగం తొలి త్రైమాసికం జీవీఏ లక్ష్యం రూ.33,790 కోట్లు కాగా, రూ.5062 కోట్లు సాధించింది. 14.98 శాతం అచీవ్‌మెంట్‌తో ఎనిమిదో స్థానంలో నిలిచింది. వ్యవసాయ రంగంలో రాష్ట్ర సగటు జీవీఏ 13.52 శాతం కన్నా జిల్లా జీవీఏ ఎక్కువగా నమోదవడం విశేషం. 2025-26లో పారిశ్రామికరంగం జీవీఏ లక్ష్యం రూ.15586 కోట్లు కాగా, తొలి త్రైమాసికంలో రూ.3386 కోట్లు సాధించింది. 21.73 శాతం లక్ష్యాన్ని సాధించి 19వ స్థానంలో నిలవగా, ఇది రాష్ట్ర సగటు (23.35 శాతం) కన్నా తక్కువ కావడం గమనార్హం. ఇక జిల్లాలో సేవా రంగానికి సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.35,732 కోట్లు జీవీఏ లక్ష్యంగా పెట్టుగా, తొలి త్రైమాసికంలో రూ.7577 కోట్లు సాధించింది. 21.21 శాతం అచీవ్‌మెంట్ సాధించి 20వ స్థానంలో నిలవగా, ఇది రాష్ట్ర సగటు(22.14 శాతం) కన్నా తక్కువగా ఉంది. అంటే వ్యవసాయ రంగంలో అనుకున్న మేర ప్రగతి సాధించినప్పటికీ పారిశ్రామిక, సేవా రంగాల్లో మాత్రం ఇంకా మెరుగుపడాల్సి ఉంది. కాగా స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు సంబంధించి జిల్లా అనుసరించిన మార్గాలు, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో జిల్లా కనబరిచిన పనితీరును కూడా ప్రభుత్వం లెక్కించింది. దీనికి సంబంధించి కూడా ప్రగతి నివేదికను విడుదల చేసింది. జిల్లాలు, మండలాల వారీగా స్కోర్‌తో పాటు ర్యాంకులను ప్రకటించింది. స్వర్ణాంధ్ర కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)లో జిల్లా స్కోర్ 63 పాయింట్లు కాగా 'బీ' గ్రేడ్ దక్కింది. ఈ స్కోర్ ప్రకారం వలేటివారిపాలెం మండలం 54 పాయింట్లతో రాష్ట్ర వ్యాప్తంగా కింద నుంచి పది మండలాల్లో ఒకటిగా ఉంది. ఈ కాన్ఫరెన్స్ సందర్భంగా ప్రభుత్వం కలెక్టర్లకు అనేక అంశాలపై దిశానిర్దేశం చేసింది. ఎంఎస్ఎంఈ పార్కులపై ఎప్పటికప్పుడు సమీక్షించి, పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. అలానే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన సంస్థలతో ప్రతీ 15 రోజులకు ఒకసారి సమీక్షించి, వారికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది.



నెల్లూరులోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ సమ్మెలో భాగంగా మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటసుబ్బారావు

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

- ఆగిన రిజిస్ట్రేషన్లు
- బోసిపోయిన కార్యాలయాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాఫ్ట్‌వేర్ విధానంలో లోపాలు సరిచేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖరులు సోమవారం జిల్లావ్యాప్తంగా పెన్‌డౌన్ సమ్మె ప్రారంభించారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రజలు లేక బోసిపోయాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా ప్రభుత్వానికి వస్తున్న ఆదాయానికి గండి పడింది.

నెల్లూరు నగరంలోని ప్రధాన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రాష్ట్ర దస్తావేజు సంఘం నేతలు, జిల్లా నేతలు, స్టాంపు వెండర్ల సంఘం నేతలు పెద్ద సంఖ్యలో పెన్‌డౌన్ సమ్మె చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకసుబ్బారావు మాట్లాడుతూ ఓటీపీని ప్రవేశపెట్టిన ప్రారంభంలో ఒకే ఒక్కసారి నమోదు చేసేవారన్నారు. కానీ ప్రస్తుత విధానంలో డేటా ఎంట్రీ చేస్తే ఓటీపీ ప్రతీసారి అప్ లోడ్ చేయాల్సి వస్తున్నదన్నారు. అన్నీ సరిచేసుకుని దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్‌కు దాఖలు చేస్తే సర్వర్ సమస్యతో దస్తావేజు చెక్ స్లిప్ రావడం లేదన్నారు. రిజిస్ట్రేషన్ కోసం మళ్లీ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేయాల్సి పరిస్థితి తలెత్తుతున్నదని వివరించారు. దీంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయని తెలిపారు. అలాగే కొత్తగా ప్రవేశపెట్టిన ఆటో మ్యూటేషన్ రిజిస్ట్రేషన్ కోసం పబ్లిక్ డేటాలో ఇంటి డోర్ నంబరు ఫీడ్ చేస్తే, అసెస్మెంట్ నంబరు కంప్యూటర్ డేటాలో కనిపించడం లేదన్నారు. అసెస్మెంట్ నంబరు ఫీడ్ చేస్తే, ఇంటి డోర్‌నంబరు కనిపించడం లేదన్నారు. దీంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ సీతాపతి రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు గాదె రవికుమార్, నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటి కొండ ఎలియాజర్, ఒంగోలు అధ్యక్షుడు ఎం హరిబాబు, నెల్లూరు అధ్యక్షుడు జేవీబీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కావలి టౌన్ : విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు, కావలి, ముత్తుకూరులతోపాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు పెన్షన్ ట్రస్టుల్లో నిధులు జమచేసి, ట్రస్టులను బలోపేతం చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగుల పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పూర్తిగా వైద్య ఖర్చులు చెల్లించాలని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, క్షేత్రస్థాయిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, జేఎల్ఎం గ్రేడ్-2లను రెగ్యులర్ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు.

గ్రేడ్-2 మున్సిపాలిటీగా బుచ్చి

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీని గ్రేడ్- 2 మున్సిపాలిటీగా మార్చారు. ఈ మేరకు జీవో నంబరు 178ను విడుదల చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. గ్రేడ్-2 మున్సిపాలిటీగా మార్పు చెందడం వల్ల ప్రభుత్వం అధికంగా నిధులు మంజూరు చేయడంతోపాటు పట్టణంలో కూడా ఆదాయ వనరులు కూడా పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్‌శాఖామంత్రి పొంగూరు నారాయణకు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి కూడా వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. తాను చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో బుచ్చి గ్రేడ్-2 మున్సిపాలిటీ కావడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇక బుచ్చి పట్టణానికి మహర్దశ పట్టనున్నదని తెలిపారు.

ఎంపీడీవోలకు పోస్టింగులు

నెల్లూరు (జడ్పీ),సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదోన్నతి పొందిన పలువురికి ఎంపీడీవోలుగా పోస్టింగులు ఇస్తూ జడ్పీ సీఈవో మోహన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి, చిత్తూరు నెల్లూరు జిల్లాలకు చెందిన పలువురు డిప్యూటీ ఎంపీడీవోలు, ఏవోలకు ఇటీవల ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన వారికి ఆయన పోస్టింగులు ఖరారు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా చిట్టమూరు ఎంపీడీవోగా ఉమామహేశ్వరరావు, దక్కిలి ఎంపీడీవోగా సీహెచ్ రవీంద్రబాబు, వాకాడు ఎంపీడీవోగా ఎం. సాయిప్రసాద్, బాలాయపల్లి ఎంపీడీవోగా డీ. నారాయణ, ఓజిలి ఎంపీడీవోగా ఎం. నారాయణరెడ్డి, సూళ్ళూరుపేట ఎంపీడీవోగా టీ. సుకుమార్, దుత్తలూరు ఎంపీడీవోగా ఎల్. చెంచమ్మ, ఉదయగిరి ఎంపీడీవోగా బీ. శ్రీనివాసులు, నెల్లూరు రూరల్ ఎంపీడీవోగా ఎంవీ. రమణమ్మ, చేజర్ల ఎంపీడీవోగా ఆలీషాబాబు, సైదాపురం ఎంపీడీవోగా రామ్మోహన్‌రెడ్డి, కలువాయి ఎంపీడీవోగా ఎ. శైలజ, వరికుంటపాడు ఎంపీడీవోగా డీవీ.రమణారెడ్డికి పోస్టింగులు ఇచ్చారు. వీరంతా ఈ వారంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆ సీటు భలే హాటు..!

- చర్చనీయాంశంగా టీజీపీ ఎస్ఈ పోస్టు
- బలమున్నోళ్లకే కుర్చీ.. ఏడాదిలో నలుగురి మార్పు
- నెలాఖరుకు రిటైరవుతున్న ప్రస్తుత ఎస్ఈ
- తాజాగా ముగ్గురు యత్నాలు



నెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మకరందం కోసం పూల చుట్టూ తేనెటీగలు తిరిగినట్లుగా ఇరిగేషన్ శాఖలోని ఇంజనీర్లు తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈ పోస్టు కోసం తిరుగుతున్నారు. ఏడాదిలో నలుగురు ఇంజనీర్లు ఈ పోస్టులో కూర్చోవడం గమనార్హం. ఒక అధికారి తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఆ సీటులో కూర్చున్న వెంటనే, మరో అధికారి వచ్చి దాన్ని కదిలిస్తారు. తాజాగా మరో ముగ్గురు అధికారులు ఈ పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ వారి అనుమతి కోసం ప్రయత్నిస్తున్నారు. అసలు ఎందుకు...? టీజీపీ ఎస్ఈ పోస్టుకు అంత డిమాండ్...? అన్నదే చర్చనీయాంశంగా మారింది.

● ఆ పోస్టుకు తీవ్రంగా యత్నాలు

టీజీపీ రెగ్యులర్ ఎస్ఈగా పనిచేస్తున్న హరినారాయణరెడ్డి గత ఎన్నికలకు ముందే రిటైర్డ్ అయ్యారు. ఆ స్థానంలో టీజీపీ వెంకటగిరి డివిజన్ ఈఈగా పనిచేస్తున్న రాధాకృష్ణమూర్తికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కొన్ని నెలలకే ఇన్‌చార్జి బాధ్యతల నుంచి ఆయన తప్పుకున్నారు. ఆ స్థానంలో సోమశిల ప్రాజెక్టు ఈఈగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి ఇన్‌చార్జిగా వచ్చారు. మరికొన్ని నెలలకే ఈ స్థానంలో మళ్లీ రాధాకృష్ణమూర్తి ఇన్‌చార్జిగా వచ్చారు. ఇలా నాలుగైదు నెలలు గడిచాక ప్రభుత్వం ఇరిగేషన్ శాఖలో పదోన్నతులు కల్పించింది. ఈ క్రమంలో టీజీపీ రెగ్యులర్ ఎస్ఈగా రాధాకృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఆయన ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఇప్పుడు ఆ పోస్టు కోసం పలువురు అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజకీయ, ఆర్థిక బలమున్నోళ్లే ఇక్కడకు వస్తున్నారని టీజీపీ ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మరోసారి టీజీపీ ఎస్ఈ పోస్టు చర్చనీయాంశంగా మారింది. చాలామంది అధికారులకు ఈ ఎస్ఈ పోస్టుపై ఆసక్తి ఉన్నా, ప్రధానంగా ముగ్గురు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు ఆ శాఖలో చెప్పుకుంటున్నారు. ఎస్ఈ స్థాయి అధికారులు లేకపోవడంతో ఈఈ స్థాయి అధికారులు ఇన్‌చార్జి బాధ్యతల కోసం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టులో ఈఈగా ఉన్న సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ సర్కిల్‌లో డిప్యూటీ ఎస్ఈగా ఉన్న గిరి, ఒంగోలులో ఈఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అనే అధికారులు టీజీపీ ఇన్‌చార్జి ఎస్ఈ పోస్టు కావాలని కోరుతున్నట్లు సమాచారం. తెలుగుగంగ ప్రాజెక్టు పరిధిలోని ఎమ్మెల్యేల మద్దతును సంపాదించేందుకు ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చివరికి ఎవరికి ఇన్‌చార్జి బాధ్యతలు దక్కుతాయన్నది టీజీపీ వర్గాల్లో ఆసక్తిగా మారింది. కాగా ప్రస్తుతం టీజీపీ పరిధిలో ప్రధానంగా సోమశిల-కండలేరు వరద కాలువ విస్తరణ పనులు, సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 పనులు, అల్తూరుపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జరుగుతున్నాయి.

వైభవంగా గణేశ్ నిమజ్జనం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడలో పాఠశాల పక్కన పడమర వీధిలో యువత ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాన్ని సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. గ్రామోత్సవం భక్తులను అలరించింది. నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి జనం అధికసంఖ్యలో తరలివచ్చారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10452
వెండి కిలో ధర	రూ. 132300
వెండి ఒక గ్రాము	రూ. 135.30

గంధం మహోత్సవానికి ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

వెంకటాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ 248వ గంధ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. నెల్లూరు నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సోమవారం సాయంత్రం వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కసుమూరు మస్తాన్ వలీ గంధమహోత్సవం ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. దర్గా ప్రాంగణంలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. పార్కింగ్‌కు పక్కా ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల అవసరాల మేర మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అవసరాలను బట్టి మొబైల్ టాయిలెట్ల సంఖ్యను పెంచాలన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తుల రక్షణ కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా చూడాలన్నారు. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారుల సహకారంతో ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. నెల్లూరు ఆర్డీఓ అనూషా, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ఖుదావన్, కసుమూరు దర్గా ఈఓ షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

ముత్తుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కార్డ్ 2.0 కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, వెంటనే తొలగించాలని డాక్యుమెంట్ రైటర్లు సోమవారం మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట పెన్‌డౌన్, రిలే దీక్షలు నిర్వహించారు. డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ పబ్లిక్ డేటాలో జరిగే తప్పులను సవరించే అవకాశం గతంలో ఉండేదన్నారు. ప్రస్తుతం కార్డ్ 2.0 సాఫ్ట్‌వేర్ కారణంగా ఆ అవకాశం లేకుండా పోయిందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేటప్పుడు పలుమార్లు ఓటీపీలు రావడం ఆలస్యం అయితే రిజిస్ట్రేషన్ ఆగిపోయి కక్షిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ విక్రయ పత్రాల దస్తావేజులకు ప్రిన్సిపుల్ ఆధార్ ఓటీపీ అవసరం లేకుండా ఏజెంట్ ఆధార్ ఓటీపీతో రిజిస్ట్రేషన్ సజావుగా జరిగే ప్రక్రియ కల్పించాలన్నారు. ప్రజలు స్టాంపుల కొను గోలు సమయంలో ఓటీపీల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు.

గడ్డివాముల దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

ముత్తుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండు గడ్డివాములు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన సంఘటన వల్లూరు పంచాయతీ అచ్చన్నతోపు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. అచ్చన్నతోపు గ్రామానికి చెందిన అన్నదములు నంత్యాల కృష్ణయ్య, నంద్యాల ఏడుకొండలు తమ పశువుల కోసం రూ.3లక్షలు వెచ్చించి గడ్డి కొనుగోలు చేసి వాములు ఏర్పాటు చేసుకున్నారు. గడ్డివాములో పక్కనే ఉన్న సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌పై కాకి వాలడంతో మంటలు చెలరేగి రవ్వలు పక్కనే ఉన్న గడ్డి వాములపై పడ్డాయి. దానికితోడు గాలి ఎక్కువగా వీస్తుండడంతో మంటల ఉధృతి పెరిగిపోయింది. నెల్లూరు నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపు కాలేదు. దీంతో గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

చికెన్ వ్యర్థాల వాహనాల స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ వద్ద పొలాల్లో సోమవారం రెండు చికెన్ వేస్టేజ్ వాహనాలను సీఐ శ్రీనివాసులు రెడ్డి స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చికెన్ వేస్టేజ్ రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చ రించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుపూరు సమీపంలోని జ్యోతి నగర్ దగ్గర ఉన్న మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పొదలకూరు పట్టణానికి చెందిన రాజేష్ అతని స్నేహితుడు ఇద్దరూ కలిసి మోటర్ బైక్‌పై ముత్తుకూరుకు వెళ్తుండగా మార్గం మధ్యలో కనుపూరు సమీపంలో ఎదురుగా వచ్చిన ఓ ఆటో అదుపుతప్పి బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ బోల్తాపడి ఇద్దరు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వెంకటాచలం సీహెచ్ సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి టీడీపీ కార్యకర్త మృతి

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యో): మండలంలోని పంచేడు గ్రామం పడమర దళితవాడలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త నావూరు రమణయ్య (55) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. రమణయ్య ఆదివారం రాత్రి నుంచి కనపడలేదు. ఉదయం స్థానికులు కాలువలో మృతదేహాన్ని గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. ఆరు నెలల వ్యవధిలోనే భార్యాభర్త మృతి చెందడంతో దళితవాడతోపాటు మృతుడి బంధువుల్లో విషాదం నెలకొంది. వరికోతల సమయంలో పొలంలో పనులు చేస్తుండగా ట్రాక్టర్ వెనుకకు వస్తూ ప్రమాదవ శాత్తు మృతుడి భార్య నావూరు ప్రమీలమ్మ మృతి చెందింది. అప్పటినుంచి మనోవేదనకు గురైన రమణయ్య కాలువలో పడి మృతి చెందాడు.

ప్రైవేటుపరం చేయడం తగదు

కోవూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్ని ప్రైవేటుపరం చేయడం తగదని బీఎస్పీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కడింపాటి అశోక్ అన్నారు. ఓ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన బీఎస్పీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎస్పీ నాయకులు కడింపాటి అనిల్, ముదివర్తి కృష్ణమూర్తి. చాట్ల వేణు, గరికి చంద్ర, రవి, ధారా మల్లి పాల్గొన్నారు.

కాలువ పూడికతీత పనుల ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైవేకిరువైపులా కాలువల పూడికతీత పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ, సీఐ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో 4 ఎక్స్‌కవేటర్లతో రాఘవరెడ్డి కాలనీ నుంచి పనులను ప్రారంభించారు. రాఘవరెడ్డి కాలనీ నుంచి కేఎం. ఆసుపత్రి వరకు సుమారు 3.5 కిలోమీటర్లమేర పూడికతీత చేపట్టాల్సి ఉండగా, తొలిరోజు అర కిలోమీటరు మేర పూర్తి చేశారు. దుకాణాదారులు, యజమానులు సహకరిస్తే త్వరగా పూడికతీత పనులు పూర్తవుతాయని కమిషనర్ తెలిపారు. పూడికతీతపై ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని ఇటీవల బుచ్చిలో ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్ర శాంతి రెడ్డి దుకాణాదారులు, వ్యాపారస్థులు, యజమానులకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

18న పాల్కన్ సిటీ డిప్యూటీ మేయర్ రాక

● గిరిజన బాలలతో ముఖాముఖి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని పాల్కన్ సిటీ డిప్యూటీ మేయర్ చలంచర్ల ఏడుకొండలు ఈనెల 18న నెల్లూరుకు రానున్నారని యానాదుల హెల్త్, ఎడ్యుకేషన్ ట్రస్టు కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఈనెల 18 నుంచి 23 వరకు జిల్లాలోని పలు గురుకుల పాఠశాలలను సందర్శించి, అక్కడి బాలబాలికలతో ముఖాముఖి నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 21న ఉదయం 10 గంటలకు నగరంలోని భక్తవత్సలనగర్‌లో గల గిరిజనభవన్‌లో గిరిజన యువకులతో సమావేశం నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగ విషయాలపై పలు సూచనలు అందచేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

ముత్తుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం మండలంలోని బ్రహ్మదేవం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ ఇంజనీర్స్‌డే సందర్భంగా విద్యుత్ ఏఈ అక్బర్ తొలుత ఉద్యోగులకు జాతీయ యూనిస్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో విద్యుత్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర వ్యాప్తంగా తమ ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, వారికి ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇవ్వాలని, విద్యుత్ ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు మురళీకృష్ణ, సుబ్రహ్మణ్యం, జేఈ స్వాతి, ఎల్ఎంలు రాజగోపాల్, ఏడుకొండలు, రఫీ, సుధాకర్ పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో పొణకా కనకమ్మ వర్ధంతి



కనకమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ కమిటీ సభ్యులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యా గ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పొణకా కనకమ్మ వర్థంతి సభ నిర్వ హించారు. ముందుగా ఆశ్రమ కమిటీ సభ్యులు మన్యం చంద్ర శేఖర్‌రెడ్డి, షేక్ అల్లాబకష్ పొ ణకా కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రాలు, పూలమాలలు, ఖాదీ మాలలను సమ ర్పించి నివాళుల ర్పించారు. నెల్లూరు రవీంద్రరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో నెల్లూ రుకు జాతీయ ఖ్యాతి తెచ్చిన ధీరవనిత పొణకా కనకమ్మ అని కొనియాడారు. పల్లెపాడులో పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమాన్ని మహాత్మాగాంధీ స్వహస్తాలతో ప్రారంభించారన్నారు. ఈ ఆశ్రమం కోసం కనకమ్మ తన ఒంటిపైనున్న బంగారు నగలు అమ్మి విరాళంగా ఇచ్చిందని, ఆనాటి నుంచి తుదిశ్వాస విడిచే వరకు ఆమె నగలు ధరించలేదని తెలిపారు. పల్లెపాడు పెన్నానది ఒడ్డున గాంధీ ఆశ్రమం కోసం 13 ఎకరాలు కొని స్వరాజ్యం సంపాదించాలనే ధ్యే యంతో పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమానికి విరాళంగా ఇచ్చిందన్నారు. పొణకా కనక మ్మలాంటి మహోన్నత వ్యక్తి శిలావిగ్రహం నెల్లూరు నగరంలో కనీసం ఏర్పాటు చేయక పోవడం బాధాకరమన్నారు. కనకమ్మ విగ్రహం వద్ద ఘన నివాళులర్పిస్తూ మౌనం పాటిం చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఏఆర్‌వీ కమిటీ సభ్యులు ఎంవీ రాజగోపాల్‌రెడ్డి, ఆశ్రమ మేనేజర్ మనోజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



అండర్-17 బాక్సింగ్ టీం

పొదలకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 69వ స్కూల్ గేమ్స్ సెలక్షన్‌లో డీఎస్ఆర్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాక్సింగ్ అండర్-17 విభాగంలో కాత్యాయినీ, కె.లీలా, రూప, జావలి, నిఖిత, హేమలత, అండర్-19 విభాగంలో టీవీఎస్ హర్షిణి, కె.హనీ, ఎన్.స్వప్నప్రియ, ఎం.ప్రసంశని, ఎం.రవికుమారి, కె.సంజన, ప్రణతిలు ఎంపికయ్యారు. ఈ రాష్ట్రస్థాయిలో పోటీలు ఈస్ట్‌గోదావరి జిల్లాలో కాకినాడలో జరుగుతాయని ఎంపికైన వీరు నెల్లూరుజిల్లా తరపున ఆడుతారన్నాని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, తెలిపారు.అలాగే వెయిట్ లిఫ్టింగ్‌లో అండర్ -17లో కె.చందనప్రియ, అండర్-18లో జానకి, పావని, జయశ్రీ, స్వప్నప్రియ, జావలి, హేమలతలు ఎంపికయ్యారన్నారు. వెయిట్ లిఫ్టింగ్ గుంటూరులోని తెనాలిలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయినీలు దేవిక, పార్వతిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని విమర్శిస్తే ఊరుకునేది లేదు

● తులసీరామ్‌కు టీడీపీ బీసీ నాయకుల హెచ్చరిక



మాట్లాడుతున్న తెలుగు యువత అధ్యక్షుడు శివుడు రాజాగౌడ్

మనుబోలు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డిని విమ ర్శిస్తే ఊరుకునేది లేదంటూ సర్వేపల్లి తెలుగు యువత అధ్యక్షుడు శివుడు రాజాగౌడ్ హెచ్చ రించారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ ఆవరణంలో మండల టీడీపీ బీసీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డిపై వైసీపీ నాయకులు ఆవుల తులసీరామ్ యాదవ్ చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. స్థాయి మరిచి మాట్లాడితే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. వైసీ పీ చోటా నాయకులను సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే వెనకుండి నడిపిస్తున్నారన్నారు. ఆయన హయాంలో సర్వేపల్లిలో అన్ని దోచేసి ఇప్పుడు తమ నాయకుడిని విమర్శించడం తగదన్నారు. ఆశం సురేష్ మాట్లాడుతూ బీసీ నాయకుల ఎదుగుదలకు గత ముఖ్యమంత్రి ఏమీ చేయలేదన్నారు. ఇప్పటికే పలు కేసుల్లో జైలుకెళ్ళి నెలలు కాలాలు గడిపినా ఆయనలో మార్పు రాలేదన్నారు. తీరు మారకుంటే మరోమారు జైలు కెళ్ళాల్సి వస్తుందన్నారు. బీసీ సెల్ నాయకులు రావుల జితేంద్రగౌడ్, వేముల గోపి, హరిబాబు, పాశం నాగరాజు, రాజేంద్ర, జన సైనికులు ఎస్‌కే. జాకీర్, పెనుబాక మహేష్ పాల్గొన్నారు.

భూసార పరిరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మారుతీదేవి

ముత్తుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం బాలికల గురుకుల పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థినులకు నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ప్రాధాన్యత, భూసారం కాపాడుకోవాల్సిన అవసరంపై అధికారులు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి మాట్లాడుతూ నేలలో లభించే పోషకాలు, నేల కలుషితానికి కారణాలు, భూసార పరిరక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కల్పించారు. భూసార పరీక్ష ప్రాధాన్యతను వివరించి, పొలాల్లో మట్టి నమూనాలు ఏ విధంగా సేకరించాలో వివరించారు. మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్న మాట్లాడుతూ యూరియా వంటి రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వలన నేల సారం దెబ్బతింటుందని హెచ్చరించారు. సేంద్రియ ఎరువులు వాడితే నేల సారం పెరుగుతుందని సూచించారు. అనంతరం మల్లూరు గ్రామంలో రైతులతో సమావేశమై యూరియా అధిక వినియోగం వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఏఓ నిర్మల, పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, వ్యవసాయ విస్తరణాధికారి దేవరాజ్, శాస్త్ర ఉపాధ్యాయురాలు భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు స్ఫూర్తిప్రదాత 'మోక్షగుండం'

ఆత్మకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భావితరాల ఇంజనీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిప్రదాత అని పీఆర్ఐ డిఈ జి ఏడుకొండలు తెలిపారు. సోమవారం స్థానిక పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన ఏఈలు, సిబ్బందితో కలిసి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆత్మకూరు, మర్రిపాడు మండలాల పీఆర్ఐ ఏఈఈలు షేక్ ఖాదర్‌మస్తాన్, ఎం శ్రీవాసు, జెటీవో వి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు బాలబాలికల గేమ్స్ సెలక్షన్స్

జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శులు బీవీఆర్, దేవిక

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): నేడు 14, 17 ఏళ్ల బాలబాలికలకు క్రీడా ఎంపికలు, పలు క్రీడా అంశాలకు సంబంధించి కావలి, పొదలకూరు, నెల్లూరులో జరుగుతాయని జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శులు, బీవీ. రమణయ్య, ఎం. దేవిక ప్రకటనలో తెలిపారు. కావలిలోని మోడరన్ పెంటాతలిన్, జేబీ కాలేజిలలో జిమ్నాస్టిక్స్ ఓల్డ్ టౌన్‌లోని మున్సిపల్ హైస్కూల్, పొదలకూరులోని రబ్బీ జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్‌లో జరుగుతాయని వారు పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో టైక్వాండో జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9490320435, 9989803384 ఈ నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

అధిక ఎరువుల వాడకం అనర్థదాయకం

ఆత్మకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు విచక్షణారహితంగా ఎరువులు వాడడం అనర్థదాయకమని మండల వ్యవసాయశాఖాధికారి కె కిషోర్‌బాబు తెలిపారు. సోమవారం మండలంలోని వాశిలి రైతు సేవా కేంద్రంలో ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూరియా అధికంగా వాడడం వలన నేలలో భూసారం తగ్గిపోతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు.

C.R.I.M.E N.E.W.S

పట్టుబడిన దొంగలు

● 11 బైకుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న స్కూటర్లతో సీఐ వేణు, సిబ్బంది

నెల్లూరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను అపహరించుకు వెళ్తున్న దొంగలను నెల్లూరురూరల్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వారి నుంచి 11 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను రూరల్ సీఐ గుంజి వేణు వెల్లడించారు. నెల్లూరు నగరంలోని కోటమిట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ సిద్దిక్, వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన పఠాన్ రోషన్‌లు ధనలక్ష్మీపురం కూడలిలో అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నెల్లూరురూరల్‌తో పాటు కావలి 1, 2వ టౌన్, రూరల్, గూడూరు 1, 2వ టౌన్ పరిధిలో 10 మోటారు సైకిళ్లను అపహరించుకెళ్లినట్లు అంగీకరించారు. మరో బైకును స్వాధీనం చేసుకోగా దానిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. వీటి విలువ రూ.10.4 లక్షలు ఉంటుంది. దీంతో వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. వీరిని పట్టుకోవడంలో ఎస్ఐ లక్ష్మణరావు, ఏఎస్ఐ రఫీ, కానిస్టేబుళ్లు ఆదినారాయణ, చిరంజీవి, జడపల్లి మోహన్‌కృష్ణ, మోహన్ బాబులు క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు.

వైద్యశాలలో అగ్నిప్రమాదం

● తప్పిన ముప్పు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని పొగతోటలో ఉన్న అశ్విని న్యూరో వైద్యశాలలో సిబ్బంది గదిలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసి రోగులను పక్క వైద్యశాలకు తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక అధికారుల సమాచారం మేరకు.. అశ్విని న్యూరో సూపర్ స్పెషాలటీ ఆసుపత్రిలో సోమవారం తెల్లవారు జామున పొగలు రావడంతో అప్రమత్తమైన వైద్యశాల సిబ్బంది వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది అద్దాలు పగలుగొట్టి లోపలికి ప్రవేశించి మంటలను అదుపు చేశాయి. కాగా వైద్యశాలలోని మూడవ ఫ్లోర్‌లో సిబ్బంది కోసం ఓ గదిని కేటాయించారు. మూడు రోజులుగా ఆ గదిలో ఎవ్వరు ఉండటం లేదు. అయినా గదిలో ఫ్రిజ్, గ్రీజర్‌లు ఆన్‌లో ఉండటంతో సోమవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. దీంతో గదిలోని బీరువాలో, బయట ఉన్న వస్తువులతో పాటు సిలిండర్‌కు మంటలు అంటుకున్నాయి. ఇన్‌చార్జి ఏడీఎఫ్‌వో శ్రీనాథ్‌రెడ్డి, ఎల్ఎం చంద్రశేఖర్ పర్యవేక్షణలో సంఘటన స్థలంకు చేసుకున్న అగ్నిమాపక సిబ్బంది పక్క భవనంలో నుంచి అద్దాలు పగులగొట్టుకొని పై గదిలోకి ప్రవేశించి తలుపులు పగులగొట్టి మంటలను అదుపు చేశారు. డాక్టర్ ఏ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు రూ.3 లక్షల నష్టం వాటిల్లింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కావలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొని పందిటి వేంకటేశ్వర్లు (29) మృతి చెందిన సంఘటన కావలి మండలం గౌరవరం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దగదర్తి మండలం దుండిగంకు చెందిన వేంకటేశ్వర్లు మతి స్థిమితం కోల్పోయి పదేళ్లుగా ఇంటికి దూరంగా ఉంటున్నాడు. ఈక్రమంలో గౌరవరం సమీపంలోని నర్సరీ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వేంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమల రెడ్డి తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి ఆరోపణలపై విచారణ

● ఇరువర్గాల ఘర్షణ

మర్రిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన పలు ఆరోపణలపై ఆత్మకూరు ఏపీవో ప్రతాప్‌రెడ్డి సోమవారం విచారిస్తుండగా రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకున్న ఘటన మర్రిపాడు మండలం కంపసముద్రంలో చోటుచేసుకుంది. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య పనులకు వెళ్లనివారికి సైతం మస్టర్లు వేసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తూ ఇటీవల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆత్మకూరు ఏపీడి కంపసముద్రం సచివాలయంలో విచారణ చేపట్టారు. గ్రామస్థులను విచారిస్తూ, రికార్డులను పరిశీలిస్తుండగా ఫీల్డ్ అసిస్టెంట్ కు చెందిన కొంతమంది కేకలు వేసి గందరగోళం సృష్టించారు. దీంతో ఫిర్యాదుదారులకు ఫీల్డ్ అసిస్టెంట్ వారికి మధ్య ఘరణ, తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు కలుగజేసుకొని ఇరువర్గాలవారిని చెల్లాచెదురు చేశారు. విచారణను మధ్యలో వదిలేసి ఏపీడి ప్రతాప్‌రెడ్డి, మర్రిపాడు ఏపీవో వెంకటనారాయణ అక్కడ నుండి వెళ్లిపోయారు.

అదృశ్యమైన విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

నెల్లూరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఓ కళాశాలలో ఇంటర్ చదువుతూ అదృశ్యమైన సాయి అనే విద్యార్థిని అధికారులు సోమవారం అతని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ కథనం మేరకు.. నగరంలోని అన్నమయ్య సర్కిల్ ప్రాంతానికి చెందిన సాయి ఆగస్టు 14వ తేదీన కళాశాల నుంచి ఇంటికి వచ్చిన తరువాత కనిపించకుండా అదృశ్యమయ్యాడు. దీంతో అతని తల్లిదండ్రులు అనేక చోట్ల గాలించినా ఆచూకీ లేకపోవడంతో అదేనెల చివరిలో పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు దర్యాప్తుచేయగా అతను శ్రీకాళహస్తిలో హిజ్రాలతో కలిసి ఉన్నాడని తెలిసి పోలీసులు అక్కడికి వెళ్లి ఆ విద్యార్థిని తీసుకువచ్చి సోమవారం నెల్లూరురూరల్ తహసీల్దారు కృష్ణప్రసాద్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

సారా బట్టీ ధ్వంసం

ఉదయగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా బట్టీని సోమవారం అధికారులు ధ్వంసం చేశారు. సారా బట్టీ నిర్వహణపై వివిధ పత్రికల్లో కథనాలు రావడంతో పోలీసు, ఎక్సైజ్, అటవీ శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నాటుసారా తయారీకి నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లంఊటను నేలపాలు చేశారు. అలాగే సారా తయారీకి ఏర్పాటు చేసిన బట్టీ, ఇతర సామాగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం సారా తయారీకి ఉపయోగించే వివిధ సామాగ్రి, డ్రమ్ములు ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. బట్టీ నిర్వహణలో ఎవరి హస్తముందో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, అల శ్రీను, ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్, అటవీ శాఖ సిబ్బంది లక్ష్మీప్రసన్న, బచ్చల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 550

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మొక్కలు పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర కార్యాలయ ప్రచార సహాయకులు పీ.హరికృష్ణ అన్నారు. బుజబుజనెల్లూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌వైకే అధికారి మహేంద్రరెడ్డి మాట్లాడుతూ దేశంలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం మొక్కలు నాటడంతో పాటు విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌సీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రసూల్, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తొలగింపునకు నగదు చెల్లించాలట!


రోడ్డు పక్కన పేరుకున్న చెత్తకుప్ప

నగరంలోని 14వ వార్డు ఏసీ నగర్ ప్రధాన రోడ్డు పక్కన చెత్త తీయాలంటే పారిశుధ్య సిబ్బందికి డబ్బులివ్వాలట.. దీంతో వారం రోజులుగా చెత్త కుప్ప నడిరోడ్డుకు చేరుతుంది. వారం క్రితం ఇక్కడ వేసిన చెట్టు కొమ్మలు, ఇతర చెత్త తరలించేందుకు పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి రోజూ ఈ రోడ్డులోనే మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలు తిరుగుతున్నా ఈ చెత్త కుప్పను తరలించ లేదు. ఇదేమిని పారిశుధ్య వాహన దారులను ప్రశ్నిస్తే ఈ చెత్త తొలగించేందుకు తమకు డబ్బులు ఇవ్వాలని, అప్పుడే తొలగిస్తామని చెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి చెత్త కుప్పను తొలగించాల్సి ఉంది.

- నెల్లూరు(వైద్యం,ఆంధ్రజ్యోతి)

వ్యర్థాలు ఇలా వేస్తే ఎలా...?

నగరంలో అధికారిక డంపింగ్ యార్డు అల్లీపురం వద్ద ఉంది. కానీ అనధికార డంపింగ్ యార్డులు నగరమంతా ఉన్నాయి. ఈ చిత్రం నెల్లూరు - జొన్నవాడ రహదారి నవబాలదుర్గాదేవి ఆలయం వద్దది. ఇక్కడ రోడ్డుకు ఆనుకుని వ్యర్థాలు వేయడంతో ఈ ప్రాంతం డంపింగ్ యార్డులా మారింది. చెత్తతో పాటు భవనాల నుంచి వచ్చే వ్యర్థాలను సైతం ఇక్కడే వేస్తున్నారు. ఇలా వ్యర్థాలు వేస్తే రోగాలు ప్రబలవా.. ?అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- నెల్లూరు రూరల్(ఆంధ్రజ్యోతి)


రహదారి పక్కన వ్యర్థాలు వేస్తున్న ట్రాక్టర్


రోడ్డు పక్కన డంప్ చేసిన చెత్త

ఎలా ఉన్నారు... ఏం చేస్తున్నారు..?

● కార్యకర్తలతో రూరల్ ఎమ్మెల్యే వినూత్న కార్యక్రమం


కార్యకర్తతో ఏకాంతంగా మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయ వర్గాల్లో నిత్యం సంచలనాలు, వినూత్న కార్యక్రమాలు, ఆసక్తికర చర్చలకు కేంద్రబిందువుగా ఉండే నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తాజాగా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'కార్యకర్తతో ఎమ్మెల్యే' పేరిట ఏకాంతంగా మాటమంతీ నిర్వ హిస్తున్నారు. రోజుకు 50 మంది కార్యకర్తలతో నెల్లూరులోని తన కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక పరమైన ఇబ్బందులు, రాజకీయ, స్థానికంగా ఎదుర్కొంటున్న అవస్థలు, తదితర అంశాలపై ఒక్కో కార్యకర్తతో 10 నిమషాలు స్వయంగా మాట్లాడి వారు చెప్పే వివరాల మేరకు ప్రణాళిక తయారు చేస్తున్నారు. గడిచిన మూడు రోజులుగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

ఖబరస్తాన్‌ను పరిశీలించిన గిరిధర్‌రెడ్డి

రూరల్లోని 32వ డివిజన్ వెంగళరావునగర్ వద్ద ఖబరస్తాన్‌లో మౌలిక సదుపాయాల కోసం ఆ ప్రాంతాన్ని ఎస్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. త్వరలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో పనులు మొదలుపెడతామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు ఈ డివిజన్ అభివృద్ధికి రూ.1.25 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నేపల్లి రఘు, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, పల్నాటి మస్తాన్‌నాయుడు పాల్గొన్నారు.

'ఎన్టీఆర్ సుజల స్రవంతి'ని వినియోగించుకోండి


పీజీఆర్‌ఎస్‌లో పాల్గొన్న అధికారులు, పౌరులు

నెల్లూరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరవాసులకు ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా సురక్షత తాగునీటి అందచేస్తున్నామని ఎస్‌ఎంసీ కమిషనర్ నందన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వెంకటేశ్వరపురం, వేపదొరువు, పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణాల్లో ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా మరో 15 రిమోట్ డిస్పెన్సరీ కేంద్రాల ద్వారా రోజు 3 లక్షల లీటర్ల నీటిని నగర వాసులకు అందచేస్తామన్నారు. ఈ కేంద్రాలలో తమ వివరాలను నమోదు చేసుకున్న తొలి వంద మందికి రూ.50ల రిజిస్ట్రేషన్ ఫీజు, మరో రూ20 రీచార్జి ఉచితమని వెల్లడించారు. రూ.2లకే 20 లీటర్ల సురక్షితమైన నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు ఆయన పాతమున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సరఫరా విభాగం, కుక్కల షెడ్‌లను పరిశీలించారు. అక్కడ్నుంచి ఇస్కాన్ వంట శాలను, ఆహార పదార్థాల తయారీని పరిశీలించారు.

స్వప్రయోజనాల కోసం దూషించొద్దు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సొంత, స్వార్థ ప్రయోజనాల కోసం కన్నతల్లి లాంటి పార్టీని, పార్టీలోని సీనియర్ నాయకులను దూషిస్తే సహించేది లేదని జనసేన పార్టీ సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ హెచ్చరించారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనసేన పార్టీలో ఉంటూ సీనియర్ నాయకులపై కొందరు పార్టీకి చెందిన వారే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి వారి జాబితా సిద్ధం చేశామన్నారు. త్వరలోనే పార్టీ అధినేతకు అన్ని విషయాలు తెలిపరుస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, సింగంశెట్టి శ్రీరామ్, పావుజెన్ని శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పెన్నా నది రివిట్‌మెంట్ పనులు పునఃప్రారంభించాలి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భగత్‌సింగ్ కాలనీ వద్ద ఆగిపోయిన పెన్నా నది రివిట్‌మెంట్ పనులు పునఃప్రారంభించాలని సీపీఎం నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం జలవనరుల శాఖ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ సూపరింటెండెంట్ గిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ రివిట్‌మెంట్ కోసం లోడిన గుంతల్లో పెన్నానదిలో వదిలిన నీరు చేరి ప్రమాదకరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మూలం ప్రసాద్, షేక్ జాఫర్, రామకృష్ణ, భగత్‌సింగ్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పీర్ కుమార్‌కి జాతీయ సేవా అవార్డు

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అధ్యాపకుడిగానే కాక నాటక, టీవీ, సినీ నటుడిగా, రచయితగా, దర్శకుడుగా, కళా రంగానికి సేవలు అందిస్తున్న డాక్టర్ పీర్ కుమార్ బద్రికి సోమవారం జాతీయ సేవా పురస్కారాలు లభించాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన మదర్ సర్వీస్ సొసైటీ 3వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలోని నట సామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర కళాకేంద్రంలో సోమవారం ఎన్టీఆర్ జాతీయ సేవా పురస్కారంతో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు ఈ-పాస్ యంత్రాల అందజేత


ఈపాస్ మిషన్ అందచేస్తున్న ఆర్డీవో

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తగా జిల్లాకు వచ్చిన ఈపాస్ యంత్రాలను నెల్లూరు ఆర్డీవో అనూష సోమవారం తాలూకాఫీసు ప్రాంగణంలో డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డికి, కొందరు డీలర్లకు అందచేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని డీలర్లందరికీ ఈ పాస్ మిషన్లు చేరుతున్నాయని తెలిపారు. కార్డుదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేసేందుకు ఈ మిషన్లు ఎంతగానో ఉపయోగపడు తాయని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులు అందచేసే యాప్ పనిచేయక పోవడం వలన వారికి సరకులు అందచేయలేకపోతు న్నామని, ఈ సమస్య పరిష్కరించాలని ఆర్డీవోను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో నిర్మలానందబాబా, నగర తాహసీల్దారు షఫీమాలిక్, రేషన్ డీటీ ఆనంద్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బాగుంది..!


ట్రాక్టర్ నడుపుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): నెల్లూరు నగర పాలక సంస్థ కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను సోమవారం కమిషనర్ నందన్ ముచ్చటపడి డ్రైవింగ్ చేశారు. పారిశుధ్య నిర్వహణ కోసం నూతన ట్రాక్టర్‌ను అధికారులు ఇటీవల కొనుగోలు చేశారు. దానిని వెహికల్ షెడ్ వద్ద పరిశీలించిన ఆయన నడుపుతూ కాసేపు అధికారులు, సిబ్బందిని ఆశ్చర్యపరిచారు. అనంతరం మరమ్మతులకు గురైన మరిన్ని వాహనాల గురించి ఆరా తీసిన ఆయన వాటన్నింటిని రిపేర్లు చేయించి వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో వైష్ణవ ఆలయాల్లో సోమవారం శ్రీకృష్ణ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సాయంత్రం 4గంటలకు శ్రీకృష్ణ శ్రీదేవి భూదేవిలకు తిరుమంజనం కనుల పండువగా జరిగింది. అనంతరం శ్రీకృష్ణ అవతార ఘట్టం పురాణ ప్రవచనం జరిగింది. శాత్తుమురై అనంతరం రాత్రి గోపురోత్సవం, తూర్పు రాజగోపురంలో ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. మాగుంట లేఅవుట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జయంతి సందర్భంగా స్వామివారికి తులసీదళ అర్చనలు, ప్రదక్షిణోత్సవాలు జరిగాయి.

పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

● వీపీసీ డీడీ సోమయ్య


వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డీడీ సోమయ

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకుందామని వెటర్నరీ పాలీ క్లీనిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీ.సోమయ్య పేర్కొన్నారు. ఎన్టీఆర్‌నగర్ పరిధిలో సోమవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్య క్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీకాను వేయించడం వల్ల గాలికుంటు వ్యాధిని అరికట్టవచ్చని అంతేకాకుండా పాల ఉత్పత్తి తగ్గకుండా క్రమబద్ధీకరించవచ్చని చెప్పారు. అక్టోబరు 15వతేదీ ఈ టీకాలు వేస్తామని, ప్రతీ పాడి రైతు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఏడీలు డాక్టర్ సీహెచ్.రామచంద్రరావు, డాక్టర్ చైతన్యకిషోర్, వెటర్నరీ విద్యార్థులు స్రవంతి, పాలిటెక్నిక్ విద్యార్థులు, గోపాల మిత్ర మల్లికార్జున, పాడిరైతులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను భాగస్వామ్యం చేయాలి:జేసీ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ సంఘాల అభివృద్ధిలో పొదుపు సంఘాలను భాగస్వాములను చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో గ్రామ సమృద్ధి స్థైర్యం అనే అంశంపై కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామా అభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన గ్రామ సమృద్ధి స్థైర్యం లక్ష్యాలను ప్రజలందరికీ చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తదితరలు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్లను ఆధునీకరించండి

నెల్లూరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్లోని గ్రామీణ ప్రాంతాల వద్ద శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్లను ఆధునీకరించాలని సీపీఎం నాయకులు జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆ పార్టీ నాయకులు పూడిపర్తి జనార్దన్, ఆలూరు తిరుపాలు మాట్లాడారు. రూరల్ మండలంలోని గొల్లకందుకూరు, సౌత్‌మోపూరు, కందమూరు, కొమ్మరపూడి, జొన్నవాడ కూడలి, ఇరుగాలమ్మ సంఘం, ఆమంచర్ల ప్రాంతాల్లో ఉన్న బస్‌షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు.

రాజరాజేశ్వరి ఆలయ హుండీల లెక్కింపు


హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఏసీ, తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని దర్గామిట్టలో వెలిసి ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో సోమవారం హుండీల లెక్కింపు జరిగింది. భక్తులు 2025 మే 14 నుంచి సెప్టెంబరు 15 వరకు 125 రోజులకు అమ్మవారికి సమర్పించిన కానుకలు రూ.36,80,471, అన్నదానం హుండీ ద్వారా రూ.1,26,234, మొత్తం రూ.38,06,705 ఆదాయం వచ్చింది. అలాగే వెండి ఆభరణములు రూ.0.250గ్రాములు, విదేశీ కరెన్సీ వచ్చింది. హుండీ లెక్కింపును సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌బాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రామతీర్థం ఈవో శ్రీధర్‌నాయుడు, ప్రధాన అర్చకులు, 4వ పట్టణ పోలీసులు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, స్టేట్ బ్యాంకు విశ్రాంత సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి

● యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. నగరంలోని డాక్టర్ జెట్టీ శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ 6వ జిల్లా మహాసభలో ఆమె మాట్లాడుతూ జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆశాల నియామకం చేపట్టాలన్నారు. ఏఎన్‌ఎంల నియామకాల నోటిఫికేషన్‌లో ఏఎన్‌ఎంల శిక్షణ పొందిన ఆశాలకు వెయిటేజీ మార్కులు ఇవ్వాలని కోరారు. అనివార్య కారణాలతో మరణించిన ఆశాలకు మట్టి ఖర్చులు చెల్లించాలని, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇన్సూరెన్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. రాజకీయ, అధికారుల వేధింపులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 20 ఏళ్లుగా ఆశాలు వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, వారికి 5జీ నెట్‌వర్క్ ఉండే మొబైల్ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కొవిడ్ సమయంలో ఆశాలు ప్రాణాలకు తెగించి రోగులకు కాపాడారన్నారు. అనతంరం ఏర్పాటు చేసిన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, అధ్యక్షురాలు మధుసూదన, జిల్లా కోశాధికారిగా మేరీ తదితరులు ఎంపికయ్యారు.

దేశం గర్వించదగ్గ ఇంజనీరు విశ్వేశ్వరయ్య

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


నుడా కార్యాలయంలో విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు జడ్పీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జలాశయాలే దేశ భవిష్యత్తని అప్పట్లోనే నమ్మి వాటి ఏర్పాటుకు కృషి చేసిన తొలితరం ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా నుడా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి తరం ఇంజనీర్లకు విశ్వేశ్వరయ్య స్ఫూర్తిదాయకమన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు. ప్రాజెక్టులు, రోడ్లు నిర్మాణాలలో ఇంజనీర్ల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఇంజనీర్లవల్లే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. నుడాలో నిధులు లేనందువల్ల మంచి ఇంజనీర్లు ఉండికూడా అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నుడా ఇంజనీర్లు చంద్రయ్య, బాల కోటయ్య, సెక్రటరీ పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇంజనీరింగ్ విద్యార్థుల రక్తదానం

నెల్లూరు(వైద్యం): జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవం సందర్భంగా గీతాంజలి కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులు, సిబ్బంది సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రక్తనిధికి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

● మోక్షగుండంకు ఘన నివాళులు

నెల్లూరు(విద్య): భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జరుపుకునే ఇంజనీర్స్‌డే సందర్భంగా వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు రామ్ ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి, భవానిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

● ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో....

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మోక్షగుండ విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం ఏడుమంది ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యానాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులనాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

● వివేకానంద వాకర్స్ ఆధ్వర్యంలో...


ఇంజనీర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇంజనీర్‌లు, వాకర్స్ సభ్యులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. అనంతరం విశ్రాంత ఇంజనీర్‌లు కె.గోపాల్‌రెడ్డి, ఎన్‌వీ.సుబ్బరాజు, ప్రస్తుత విధుల్లో ఉన్న ఇంజనీర్‌లు కె.మురళీకృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నేతలు డాక్టర్ అంకిరెడ్డి, రాఘవేంద్రషెట్టి, స్వర్ణ రమేష్‌బాబు, కేఎంకే.రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఖలీల్‌బేగ్, ఆర్‌ప్రసాద్, జయదేవ్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియురాలిని హత్య చేసిన ప్రియుడి అరెస్ట్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రియురాలిని హత్య చేసిన ప్రియుడుని దర్గామిట్ట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లికి చెందిన మైథిలీప్రియ(23) బెంగళూరులోని అమెజాన్‌లో ఉద్యోగం చేస్తుంది. తనతో కలిసి బీఫార్మసీ చదివిన రాపూరు మండలానికి చెందిన నిఖిల్‌తో ప్రేమలో ఉంది. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన బెంగళూరు నుంచి వచ్చిన ఆమె నగరంలోని పోస్టల్‌కాలనీ మొదటివీధిలో ఉంటున్న చెల్లెలు గదిలో ఉంటుంది. ఆ గదికి ఎదురింట్లోనే తన ప్రియుడు నిఖిల్ ఉంటున్నాడు. ఈనెల 12వ తేది రాత్రి ముందుగా నిద్రపోయిన చెల్లెలు అర్ధరాత్రి 1.45 గంటలకు మెళకువ వచ్చి చూడగా పక్కన అక్క కనిపించలేదు. దీంతో ఆమెకు ఫోన్‌చేయగా స్నేహితులతో ఉన్నానని, పది నిమిషాల్లో వస్తానని చెప్పడంతో ఆమె నిద్రపోయింది. 3.35 గంటలకు నిఖిల్ ఫోన్ చేసి మీ అక్క నావద్దనే ఉందని, వచ్చి తీసుకెళ్లాలని చెప్పాడు. దీంతో ఆమె తన స్నేహితురాలు, మరో ఇద్దరు మహిళలతో కలిసి నిఖిల్ గది వద్దకు వెళుతుండగా మెట్లపై మైథిలీప్రియ స్పృహకోల్పోయి కన్పించింది. ఆమె ఎడమ చంక కింద కత్తిపోటుతో రక్తం కారుతుండడంతో నిఖిల్‌ను నిలదీయగా తనతో గొడవపడటంతో కత్తితో పొడిచానని చెప్పి అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ మేరకు మృతురాలి సోదరి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిఖిల్‌ను సోమవారం అరెస్ట్ చేసి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మరో యువతితో సన్నిహితంగా ఉంటూ మైథిలీప్రియను అడ్డు తొలిగించుకోవాలన్న ఉద్దేశ్యంతోనే రూమ్‌కు పిలిచి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్య తెలిపారు.

ఆడిట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించండి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల కంప్యూటరైజేషన్‌లో ఆడిట్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నెల్లూరు డివిజన్ సహకారశాఖాధికారి కందుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ల నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లుగా పదోన్నతలు పొందిన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సహకార రంగంలో కంప్యూటరైజేషన్ ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.

రేపు సాహిత్య సభ

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చేనేత సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ రాత్రి వర్తమాన సమాజం (టౌనుహాలు)లో సాహిత్య సభ జరుగుతుందని చేనేత కార్యదర్శి వై.శేషగిరీశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ అచార్యులు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, గుర్రం జాషువా కవిత్వం మానవీయ దృక్కోణం అనే అంశంపై కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్రాంత అధ్యాపకురాలు కె.కుసుమకుమారి పాల్గొంటా రని పేర్కొన్నారు.

అన్నదాత కార్డు పొందిన ప్రతీ రైతుకు బీమా

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నదాత కార్డు పొందిన ప్రతీ రైతుకు రూ.5లక్షల బీమా వర్తిస్తుందని న్యూ అస్పిరెంట్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో గుణశేఖర్ తెలిపారని ఆ సంస్థ సభ్యుడు సాయికుమార్ చెప్పారు. సోమవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆయుష్ ఇన్ఫో సర్వీసెస్ సేవా శాఖ ద్వారా ఈ అన్నదాత కార్డులను రైతులకు అందజేయడానికి ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో గుణశేఖర్‌శెట్టి, రాజేంద్ర, నారాయణమూర్తి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహకార బ్యాంకులో కంటి వైద్యశిబిరం

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో బ్యాంకు ఉద్యోగులు, అధికారుల కోసం ప్రత్యేక కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో వాసన్ ఐకేర్‌కు చెందిన కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కలువాయి మండలం దాచూరు పంచాయతీ ముక్కుతిప్ప గ్రామంలోని సర్వే నెంబరు 989లో ప్రభుత్వ మేత పోరంబోకు 250 ఎకరాలకు గాను 194 ఎకరాలు అనాధీనం ఇచ్చి ఉన్నారని, మిగతా 56 ఎకరాలు ప్రభుత్వ పోరంబోకు కింద ఉన్న భూమిని కొంతమంది కబ్జాదారులు కన్ను వేశారని ఆ భూమిని కాపాడాలని గ్రామస్థులు ఎం.ఈశ్వరయ్య, కె.లక్ష్మయ్య, ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూమిని కాపాడా లని కోరారు. ఈ సమావేశంలో పెంచలప్రసాద్, బుజ్జి, అంకయ్య, కె.రవీంద్ర, ఈశ్వరయ్య, కోటేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలం కాదు ... కోవూరు చెరువు!

ఇది పంటపొలం కాదు. వేలాది ఎకరాలకు సాగునీరందించే కోవూరు చెరువు. గత కొద్దికాలంగా చెరువులో పెరిగిన గుర్రపుడెక్కను తొలగించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. స్వచ్ఛమైన సాగునీరు కన్పించాల్సినచోట.. గుర్రపు డెక్క చెరువును దట్టంగా ఆక్రమించేసింది. గుర్రపు డెక్కను తొలగించాలని చాలాసార్లు రైతులు ఇరిగేషన్ శాఖాధికారులకు విన్నవించుకున్నారు. అయినా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కోవూరు చెరువు మొత్తం పచ్చని పంట పొలాన్ని తలపిస్తోంది.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)



మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం రేపటి నుంచి వైద్య శిబిరాలు : డీఎంహెచ్‌వో

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశాఖతోపాటు స్త్రీ,శిశుసంక్షేమం, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా నిర్వహించే ఈ శిబిరాల్లో మహిళలకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందిస్తామని తెలిపారు. జీజీహెచ్, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీ. పీహెచ్‌సీ, యూహెచ్‌సీలు, 497 ఆరోగ్య ఉపకేంద్రాల్లోనూ వైద్య శిబిరాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

అలుగు వాగు ఆక్రమణతో పొలాలపైకి నీరు

పట్టణంలోని ఉప్పుచెరువుకు సంబంధించిన అలుగు వాగు ఆక్రమణలకు గురవడంతో అలుగునీరు పొలాలపై పడుతోంది. ఉప్పుచెరువు ఆయకట్టు భూమిలో అధికభాగం రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోవటంతో పారుదల తగ్గిపోయింది. దీంతో చెరువులోని నీటిని బయటకు పంపించేందుకు చేపల పెంపకందారులు అలుగును పగులగొట్టారు. అయితే వాగు ఆక్రమణలకు గురికావటంతో నీరు పొలాల్లోకి ప్రవహించి భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోతున్నాయని మహదేవపురం గ్రామ రైతులు వాపోతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని, అలుగుకు మరమ్మతులు చేయించి తమ భూములను కాపాడాలని కోరుతున్నారు.

- కందుకూరు(ఆంధ్రజ్యోతి)



పగులగొట్టిన ఉప్పుచెరువు అలుగు



ఆక్రమణలకు గురై కుచించుకుపోయిన అలుగు వాగు

పరిశ్రమల కోసం భూబ్యాంకు!

- జిల్లాకు తరలివస్తున్న భారీ పరిశ్రమలు
- ఇందుకోసం 5 వేల ఎకరాల సేకరణకు సన్నద్ధం
- 'ఆంధ్రజ్యోతి'తో ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్

'ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలు అందజేస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.' అని ఏపీఐఐసీ జెడ్ఎం ఎల్.శివకుమార్ అన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ 'జిల్లాకు బీపీసీఎల్ వంటి భారీ పరిశ్రమలు జిల్లాలో ఏర్పాటు కానున్నాయి. ఇటువంటి పరిశ్రమల ఏర్పాటుకు భూ బ్యాంకు తప్పనిసరిగా ఉండాలి. అందుకనుగుణంగానే జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో భూసేకరణ చేపడుతున్నాము. ప్రస్తుతానికి 5 వేల ఎకరాలు సేకరించేందుకు భూములను పరిశీలిస్తున్నాము. ప్రధానంగా నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుపై ప్రత్యేక కార్యా



ఇంటర్వ్యూ...

చరణ చేపట్టాము. ఇప్పటికే పలు నియోజక వర్గాల్లో భూసేకరణ పూర్తి చేసి పార్క్‌లను ప్రారంభించాము. నారంపేట ఫేజ్ 1, 2 కలిపి 333 ప్లాట్‌లను సిద్ధం చేశాము. వీటిలో 15 ప్లాట్లను ఇప్పటికే విక్రయించాము. త్వరలో ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. అదేవిధంగా నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ప్రాంతంలో 29.65 ఎకరాల్లో దాదాపు 147 ప్లాట్‌లను సిద్ధం చేశాము. వీటిని త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నాము. అదే విధంగా ఉలవపాళ్ల వద్ద 25 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు భూసేకరణ చేపడుతున్నాము. నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో నగరంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం పీఎఫ్‌సీ (ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్)ను నిర్మిస్తున్నాము.

● రెండేళ్లలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ నుంచి భూములు కొనుగోలు చేసిన తరువాత ఏళ్ల తరబడి పరిశ్రమలు స్థాపించని వాటిపై కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. ఇప్పటికే బొడ్డువారిపాళెం పార్క్‌లో దాదాపు 15 మంది కేటాయింపులను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చాము. భూమి కొనుగోలు చేసిన రెండేళ్ల లోపల పరిశ్రమ నిర్మాణ పనులు ప్రారంభించాలి. ఈ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అనేక రాయితీలు అందజేస్తోంది. వీటిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)

డేంజర్‌లో ఓజోన్


- ప్రశ్నార్థకరంగా జీవకోటి మనుగడ
- క్యాన్సర్, చర్మవ్యాధుల బారిన మానవాళి
- 'ఓజోన్'దెబ్బతినడమే భూతాపానికి కారణం
- మేలుకోకుంటే పరిస్థితి ఆందోళనకరం

● నేడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూమిపై ప్రతీ జీవరాశికి రక్షణ కవచంలా ఉన్న ఓజోన్ పొర పెనుప్రమాదంలో పడింది. దీంతో మానవాళితోపాటు సర్వ జీవరాశుల మనుగడే ముప్పు వాటిల్లుతున్నది. భూమిపై 15 నుంచి 25 కిలోమీటర్ల వరకు ఉండే ఓజోన్‌పొర సూర్యుడి నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపైకి చేరకుండా, అందులో ఉండే అతినీలలోహిత కిరణాలను సంగ్రహిస్తుంది. తద్వారా ప్రాణికోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుంది. ఈ క్రమంలో గత 30 ఏళ్ల నుంచి ఓజోన్ పొర క్షీణిస్తున్నదని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో జీవకోటికి తలెత్తే ముప్పును గమనించిన ఐక్యరాజ్యసమితి ఓజోన్ పరిరక్షణ కోసం సెప్టెంబరు 16న (నేడు) అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించింది. ప్రజల్లో దీనిపై అవగాహన పెంచేలా కార్యక్రమాలను రూపొందించింది. జిల్లాలో ప్రస్తుత పరిస్థితుల్లో ఓజోన్ సంరక్షణకు మేధావులు మేలుకోవాలని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● జిల్లాలో పరిశీలిస్తే ..

జిల్లాలో ఓజోన్ పరిస్థితిని పరిశీలిస్తే ప్రమాదకరంగా మారుతోంది. ప్రకృతిపరంగా కాలుష్యం పెరుగుతుంది. జిల్లాలోని గ్రామాల నుంచి అనేక మంది పట్టణాలకు వలసలబాట పట్టడంతో కాలుష్యం పెరిగిపోతూ ఉంది. ఇబ్బడి ముబ్బడిగా మోటారు



వాహనాలు పెరగటం, పరిశ్రమల కాలుష్యం, అధికశాతం మంది ఏసీల వినియోగం ఓజోన్ పొరకు చేటు తెస్తున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హేలోన్స్, మిథైల్ క్లోరోఫాం, మిథైల్ బ్రోమైడ్, హైడ్రోకార్బన్‌లు, సీఎఫ్‌సీ వంటి రసాయనిక వాయువులు ఓజోన్ పొరకు ప్రమాదాన్ని తీసుకువస్తున్నాయి. ఏరోసోల్ ఉత్పత్తులు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు. ఫోం బ్లోయింగ్ ఉత్పత్తులు, అధికంగా స్ప్రేల వినియోగం వల్ల ఓజోన్ ముప్పు వాటిల్లుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఋతువులు గతి తప్పటం, వేసవి తీవ్రత వంటి సమస్యలకు మానవాళి తప్పిదమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వీటి వాడకం తగ్గించి, ప్లాస్టిక్ వినియోగాన్ని కూడా తగ్గించ కలిగితే ఓజోన్‌ను రక్షించుకోవచ్చని వచ్చని మేధావులు చెబుతున్నారు. టైర్లు, రబ్బర్లు, ఇతర ఆధునిక ప్లాస్టిక్‌లను కాల్చటం వల్ల క్లోరిన్ సంబంధిత సేంద్రీయ పదార్థాలు వాతావరణం లో పెరుగుతాయి. ఇలా నత్రజని, సల్ఫర్ ఆక్సైడ్ లు, క్లోరోఫ్లోరో కార్బన్‌లు రసాయనిక చర్యవల్ల ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఓజోన్ ప్రమాదకర స్థాయికి చేరితే మానవాళికి ప్రాణాధారమైన ఆక్సిజన్ అందే పరిస్థితి ఉండదు. ఈ పరిస్థితిలో శాస్త్రవేత్తల సూచనలను పాటించకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా ఉంటుంది.

● ప్రమాదకర వ్యాధులకు అవకాశం

ఓజోన్ పొర దెబ్బతినటం వల్ల నేరుగా అతినీలలోహిత కిరణాలు భూమిని తాకటంతో క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వెలుగుచూస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 13వేల మంది క్యాన్సర్ బాధితులు ఉన్నారు. ఏటా ఈ సంఖ్య పెరుగుతూనే ఉంది. ఓజోన్‌పొరకు చిల్లులు పడి అతినీల లోహిత కిరణాల కారణంగా చర్మ క్యాన్సర్‌కు గురవుతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ తెలియచేస్తున్నది. వీటితోపాటు నేత్ర, జన్యుపరమైన వ్యాధులు సంక్రమిస్తున్నాయి. సముద్ర జీవరాశి కూడా నశించిపోయే పరిస్థితి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో మానవాళి మేల్కోకుంటే ముప్పు తప్పదు.

ఓజోన్ దెబ్బతినటంతో తీవ్ర అనారోగ్యం

ఓజోన్‌పొర దెబ్బతినడం మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వ్యాధులు ప్రబలుతున్నాయి. శరీరంపై బొబ్బలు రేగి అవి క్యాన్సర్ గడ్డలుగా రూపాంతరం చెందే పరిస్థితులు ఏర్పడుతున్నా యి. ఓజోన్ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలి. విరివిగా చెట్లు నాటాలి.



- డాక్టర్ కాలేషాబాషా, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్, జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు

పెరుగుతున్న క్యాన్సర్ బాధితులు

క్యాన్సర్ వ్యాధి జిల్లావాసులను కలవరపెడుతుంది. ఇందుకు ఓజోన్ పొర దెబ్బతినడం కూడా ఓ కారణం. ఎంతో మంది స్క్వామస్ సెల్ క్యాన్సర్, బేసాల్ సెల్ క్యాన్సర్, మాలిజెంట్ మెలినోమా వంటి క్యాన్సర్‌లకు గురవుతున్నారు. ఇందులో మాలిజెంట్ మెలినోమా అత్యంత ప్రమాదకరమైనది. అందరూ అప్రమత్తంగా ఉండాలి.



- డాక్టర్ గీతా ఉషశ్రీ, క్యాన్సర్ వైద్య నిపుణులు, రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి

ఫిర్యాదులపై అలసత్వం తగదు

● ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం తగదని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహ రించి పిటీషన్లను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల అధికారులను ఆదేశించారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అజిత వేజెండ్ల

గంగమ్మకు హారతి

● సంగం బ్యారేజ్ గేట్లు ఎత్తి నీటి విడుదల

పెన్నానది సంగం బ్యారేజ్ వద్ద నాయకులు, అధికారులు సోమవారం గంగమ్మకు హారతులిచ్చి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సోమశిలలో విడుదల చేసిన నీటి ప్రవాహం సోమవారం సంగం బ్యారేజ్‌కి చేరాయి. దీంతో సంగం బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.5 అడుగుల నుంచి క్రమేణ పెరుగుతూ సాయంత్రానికి 11 అడుగులకు చేరింది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం పెరగకుండా వచ్చే నీటిని యథా విధిగా దిగువకు విడుదల చేసే ఏర్పాటు చేశారు. బ్యారేజ్ డీఈ విజయరామి రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, సంగం పీఏసీఎస్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, అన్నారెడ్డి పాళెం నీటిసంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి గంగమ్మకు హారతు లిచ్చి గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఈలు వినయ్ కుమార్, ప్రసాద్, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



బటన్ నొక్కి బ్యారేజ్ గేట్లు ఎత్తుతున్న నాయకులు, అధికారులు

- సంగం(ఆంధ్రజ్యోతి)

మెట్టలో మాణిక్యం

- ఆత్మకూరుకు చెందిన డాక్టర్ విరాజితకు బంగారు పతకం

ఆత్మకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీలోని వెంకట్రావుపల్లికి చెందిన వైద్య విద్యార్థిని డాక్టర్ పందల విరాజిత ఎండీ జనరల్ మెడిసిన్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నేపథ్యంలో కడపలోని రిమ్స్ వైద్యశాలలో ఈ నెల 13, 14వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జనరల్ మెడిసిన్ వైద్యుల 53వ సదస్సులో ఎన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ చేతుల మీదుగా ఆమె బంగారు పతకం అందుకున్నారు. డాక్టర్ విరాజిత కడపలోని రిమ్స్‌లో జనరల్ మెడిసిన్ చదువుతూ ఎన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం 2024లో నిర్వహించిన ఎండీ జనరల్ మెడిసిన్ పరీక్షలలో రాష్ట్ర స్థాయిలో 76.8 శాతం మార్కుల తో ప్రథమ స్థానాన్ని సాధించి గోల్డ్ మెడల్ సాధించింది. డాక్టర్ విరాజితను ఆంధ్రప్రదేశ్ జనరల్ ఫిజిషియన్ వైద్యుల రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ అల్లాడి మోహన్, రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెం కటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ము నీశ్వ ర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాదిపతి డాక్టర్ యాదవేంద్రరెడ్డి, ఇతర బంధు మిత్రులు అభినందించారు.



నేటి నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీలకు శిక్షణ

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో మూడు రోజులపాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో జే.మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ప్రజాప్రతి నిధులకు జిల్లా స్థాయిలో స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత - గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు అనే అంశంపై శిక్షణ కార్యక్రమం జరుగు తుందని పేర్కొన్నారు. మంగళవా రం నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి ఖచ్చితంగా మహిళ సభ్యులు హాజరు కావాలన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

● పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జేసీ పాల్గొని అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులను పిలిచి వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈఓ మోహన్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

- ప్రజలకు ఉమాంగ్ యాప్‌పై అవగాహన కల్పించాలని కోరుతూ బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకా ప్రవీణ్ వినతిపత్రం సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సేవలు, పథకాలు ఉమాంగ్ యాప్‌లో ఉన్నాయన్నారు. ఈ యాప్‌పై జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించి, వారు వినియోగించుకొనేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్, బెల్లంకొండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు చిన్న పెంచలయ్య వినతిపత్రం అందచేశారు. పలుకాలనీల్లో యానాదులకు కనీస సౌకర్యాలు లేవని, వాటిని కల్పించాలని కోరారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు వినతిపత్రం అందచేశారు. జిల్లాలో ఎడగారు వరి కోతలు మొదలైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

పడితే ప్రాణాలు దక్కవు

● సోమశిల ప్రాజెక్టు వద్ద పొంచి ఉన్న ముప్పు

సోమశిల జలాశయం ప్రముఖ పర్యాటక ప్రాంతం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి ప్రతిరోజు పర్యాటకులు వస్తుంటారు. అయితే ప్రాజెక్టు వద్ద ప్రమాదం పొంచి ఉన్న విషయం వారికి తెలియదు... ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్న శ్రద్ధ అధికారులకు లేదు. జలాశయం ప్రధాన నిర్మాణంపై రెండు వైపులా దిమ్మెల తో రక్షణ ఏర్పాట్లు చేసిన పరిస్థితి ఉండగా వాటి అంచున నిలబడి ప్రాజెక్టు అందాలు వీక్షిస్తారు. అయితే కొన్ని చోట్ల దిమ్మెలు పగుళ్లు ఏర్పాడి వుండగా మరికొన్ని చోట్ల దిమ్మెలు పడిపోయి ఊచలు కనిపిస్తున్నాయి. సుమారు వందకు పైగా దిమ్మెలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ప్రమాదాలు జరుగకముందే పనులు చేయించాలని పలువురు కోరుతున్నారు.



దిమ్మెలు పడిపోయి కనిపిస్తున్న ఊచలు

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

వైద్యులు ఒకరు.. రోగులు 275 మంది !

● సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత

ఉదయగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత రోగులను వేధిస్తోంది. వైద్యశాలలో 12 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు సదరం పరీక్షలు నిర్వహించేందుకు వెళ్లగా, మరొకరికి ఆఫ్ కావడంతో ఊరెళ్లారు. ఇక దంత వైద్యుడు వైద్యశాలలోనే రోగులకు సేవలందిస్తున్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో వైద్యశాలకు రోగుల తాకిడి అధికంగా ఉంది. సోమవారం వివిధ రుగ్మతలతో బాధపడుతూ వైద్యశాలకు రోగులు బారులుతీరారు. 245 మంది ఔట్, 30 మంది ఇన్‌పేషెంట్లను కలిపి మొత్తం 275 మందికి కంటి వైద్యనిపుణుడు ఒక్కరే సేవలందించాల్సి వచ్చింది. వైద్యశాలలో ఒక్క వైద్యుడు అందుబాటులో ఉండడంతో రోగులు గంటల తరబడి క్యూలో ఉండాల్సిన దుస్థి తి నెలకొంది. ఆ వైద్యశాలకు వెళితే ఉన్న రోగం నయం కావడం అటుంచితే.. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండడంతో నీరసించి కొత్తరో గం తెచ్చుకోవాల్సిన వస్తుందని పలువురు రోగులు వాపోతున్నా రు. ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందిం చి వైద్యశాలలో వైద్యు ల కొరత తీర్చాలని పలువురు కోరుతున్నారు.



ఓపీ కోసం బారులు తీరిన రోగులు

సమస్యల పరిష్కారానికి 22 వరకు నిరసనలు

● విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22వ తేదీ వరకు ప్రతి రోజూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జేఏసీ జిల్లా చైర్మన్ కొండపల్లి శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో పలు సమస్యలపై సోమవారం నెల్లూరులోని విద్యుత్ భవన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పలుమా ర్లు విద్యుత్ యాజమాన్యానికి, ప్రభుత్వానికి తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేసినా తమ సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీంతో దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యుత్ జేఏ సీ తలపెట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 22వ తేదీ లోగా తమ సమస్యలు పరిష్కారం కానీ ఎడల అందోళన మ రింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకు లు షేక్ అల్తాఫ్, టీ శ్రీనివాసులు, డీ దామోదర్, వీ వెంకటేశ్వర్లు, సయ్యద్ రఫీ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పీ.కృష్ణ, షేక్ హజరత్‌వలి, నాంచార య్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు

నేడు ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం ఆత్మకూరులో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల, బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శిస్తారు. అనంతరం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో అన్ని విభాగాల వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10452
వెండి కిలో ధర	రూ. 132300
వెండి ఒక గ్రాము	రూ. 135.30

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రాలు

- రైతుల అవస్థలు
- మూలపడిన యంత్రాలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అండగా నిలుస్తామని గొప్పలు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలు (రైతుసేవా కేంద్రాలు) పేరుతో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసింది. అలాంటి కేంద్రాలు నేటికీ పూర్తి స్థాయి నిర్మాణాలకు నోచుకోక నిరుపయోగంగానే దర్శన మిస్తున్నాయి. దీంతో ఉద్యోగులు అరకొర వసతుల నడుమ అద్దె నివాసాలు, ప్రభుత్వ భవనాల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. అరకొర నిర్మించిన భవనాలు సైతం కేవలం ఎరువులు నిల్వచేసి పంపిణీ చేసేందుకు వినియో గిస్తున్నారు తప్ప రైతు శ్రేయస్సు దృష్ట్యా ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన పాపాన పోలేదు. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోందనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. అందుకు గాను ప్రతి కేంద్రానికి రూ. కోట్లు విలువ చేసే ఎల్ఈడీ టీవీలు, కియోస్కు యంత్రాలను సరఫరా చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో ఎంతో విలువైన అలాంటి పరికరాలు దుమ్మూ, ధూళితో నిండి నాశనమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 561 కేంద్రాల్లో రూ. 45వేలు విలువ చేసే ఒక్కో ఎల్ఈడీ టీవీ, రూ. 80వేలు విలువ కియోస్కు యంత్రాలను అందజేశారు. అయినప్పటికీ వాటిని వినియోగించిన నాథులే కరువయ్యారు.



నిరుపయోగంగా ఉన్న కియోస్కు యంత్రం



అట్టపెట్టెలోనే ఉన్న ఎల్ఈడీ టీవీ

కనిపించని టీవీలు

ఇదంతా ఒకవంతైతే పర్యవేక్షణ లోపమో, అడిగేవారు లేరులే అన్న ధీమానో ఏమోగానీ కేంద్రాలకు సరఫరా చేసిన ఎల్ఈడీ టీవీలు కనిపించడం లేదు. కొంతమంది సిబ్బంది ఎంచక్కా టీవీలను గుట్టుచప్పుడు కాకుండా తమ నివాసాల్లో ఏర్పాటు చేసుకొని కాలం వెళ్లదీస్తున్నారనే ఆరోపణలు సైతం గుప్పుమంటున్నాయి. మరికొంతమంది తమకెందుకులే అంటూ అట్టపెట్టెల్లో నుంచి బయటకు తీయకుండా అలాగే వదిలేశారు.

నిరుపయోగంగా కియోస్కులు

అధికారులు, సిబ్బంది చుట్టూ కాళ్లరిగేలా తిరగకుండా రైతులే నేరుగా కేంద్రాలకు వెళ్లి తమకు అవసరమైన ఎరువులు, పురుగుమందులను కియోస్కు యంత్రాల్లో నమోదు చేసుకొనే అవకాశం ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఏళ్ల తరబడి వినియోగానికి నోచుకోక పోవడంతో పలు ప్రాంతాల్లో బ్యాటరీలు మరమ్మతులకు గురవడంతో యంత్రాలు మూలకు చేరాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి రైతు శ్రేయస్సు దృష్ట్యా తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

సీతారామపురం, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటుకు ఎంపీపీ చింతంరెడ్డి పద్మవతి, వైసీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థలం పరిశీలించారు. అలాగే నూతనంగా సిసి రోడ్లు నిర్మించు ప్రాంతాన్ని పరిశీలించారు. వారితో బాలినేని మాబయ్య, లకిడి బ్రహ్మయ్య, నవీన్, శ్రీనివాసులు పంచాయతీ ఏఈ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఝెలాల ఉత్సవం

ఏఎస్ పేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ దర్గా గంధమహోత్సవంలో భాగంగా సోమవారం ఝెలాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ఈవో మహమ్మద్ హుస్సేన్ ఝెలాను దర్గా గుమ్మటంపైన ఉన్న చంద్రవంకకు అమర్చారు. అనంతరం దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదలు పంచిపెట్టారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఆత్మకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లి, బంట్లపల్లి తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత గ్రంధాలను చదివి ఆత్మ, పరమాత్మ, జీవాత్మ అనే విషయాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి పొదలకూరు కమిటి అధ్యక్షులు జి పెంచల నరసయ్య, సభ్యులు బి కృష్ణయ్య, టి కల్పన, టి భాగ్యమ్మ, సీహెచ్ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఉదయగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం 1 నుంచి 8వ తరగతుల విద్యార్థులకు స్పెల్‌బీ కార్యక్రమంలో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు జీ.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మొదటి ఎపిసోడ్ పూర్తయిన అనంతరం ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రశాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించే సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షురాలు పీ విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అందులో భాగంగా 15 రోజుల పాటు వైద్య, రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే బూత్‌ల వారీగా నాయకులు, అనుబంధ సంఘాల కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రముఖ్ వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి హరిగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, ఉపాధ్యక్షులు కార్తీక్, శ్రీరాములు, సుబ్బారెడ్డి, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమాహాలు వీధిలో జరుగుతున్న ఓ వివాహ మహోత్సవానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ టీడీపీ నాయకులతో కలిసి హాజరై వధూవరులైన యాకూబ్ బాషా, అస్మాలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి కాకర్ల చారిటబుల్ ట్రస్టు తరుపున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహులు, బొజ్జా శ్రీనివాసులు, సందానీ, తుమ్మల కిరణ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడదేవిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచు కామేపల్లి పద్మజ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన నారాయణ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంజనీర్లకు స్ఫూర్తిప్రదాత 'మోక్షగుండం'



మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులు అర్పిస్తున్న పీఆర్ఐ డీఈ ఏడుకొండలు, ఏఈఈలు, సిబ్బంది

ఆత్మకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భావితరాల ఇంజనీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిప్రదాత అని పీఆర్ఐ డిఈ జి ఏడుకొండలు తెలిపారు. సోమవారం స్థానిక పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన ఏఈఈలు, సిబ్బందితో కలిసి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, మర్రిపాడు మండలాల పీఆర్ఐ ఏఈఈలు షేక్ ఖాదర్‌మస్తాన్, ఎం శ్రీవాసు, జెటీవో వి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం



వినతిపత్రం అందచేస్తున్న సీపీఎం నాయకులు

అనంతసాగరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట, పాతదేవరాయపల్లి, ఆమనిచిరివేళ్ల, కొత్తపల్లి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయా గ్రామాల సీపీఎం నాయకులు సోమవారం సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందచేశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్వర్‌బాష, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

ఉదయగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి రైతుసేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయ అధికారులు రైతులకు యూరియా పంపిణీచేశారు. అలాగే నేలటూరు గ్రామంలో మండల వ్యవ సాయాధికారి విజయభాస్కర్ రైతులకు యూరియా అధిక వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రసాయనిక ఎరువులు తగ్గించుకుని సేంద్రీయ ఎరువులు వాడి భూమిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఎరువుల వాడకం అనర్థదాయకం



ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఎంఏవో కిశోర్‌బాబు

ఆత్మకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు విచక్షణారహితంగా ఎరువులు వాడడం అనర్థదాయకమని మండల వ్యవసాయశాఖాధికారి కె కిషోర్‌బాబు తెలిపారు. సోమవారం మండలంలోని వాశిలి రైతు సేవా కేంద్రంలో ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు యూరియా అధికంగా వాడడం వలన నేలలో భూసారం తగ్గిపోవడంతోపాటు పంటలకు పోషకాల స్థాయి తగ్గిపోతుందన్నారు. అధికారుల సిఫార్సు మేరకు ఎరువులను వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. అనంతరం రైతులకు పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, స్థానిక టీడీపీ నాయకుడు గంగా పద్మయ్య, విఏఏ నితీష్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడులో 144 సెక్షన్ ఎత్తివేత

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు పంచాయతీలో ఈనెల 13 నుంచి విధించిన 144 సెక్షన్‌ను ఎత్తివేసినట్లు తహసీల్దారు హేమంత్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మైనింగ్ తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని ఇటీవల ప్రజలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు విధించిన సెక్షన్‌ను సాయంత్రం నుంచి ఎత్తివేయడం జరిగిందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయులపై వివక్ష తగదు : ఏపీటీఎఫ్



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారిపట్ల వివక్ష చూపడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ హజరత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, నాలుగు విడతల కరువుభత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలన్నారు. అందులో భాగంగా ఈనెల 16న జిల్లా కేంద్రాల్లో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దారు రామ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించేందుకు ప్రయత్నించగా ఆయన తిరస్కరించడంతో నోటీసు బోర్డులో అంటించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఏపీటీఎఫ్ నాయకులు షేక్ ఎండీ ఖాజా, మాల్యాద్రి, శ్రీనివాసరాజు, షేక్ షబ్బీర్, ఓబులేసు, రామకృష్ణారెడ్డి, రజాఖ్‌అలీ, ఖాజాపీర్, వెంగళరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

దుత్తలూరు (ఉదయగిరి), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు సోమవారం తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతోపాటు ఆరేళ్లు ఒకే క్యాడర్‌లో పనిచేసిన వారికి ప్రత్యేక ఇంక్రి మెంట్లు ఇవ్వాలన్నారు. అన్ని విభాగాల్లో పదో న్నతులు కల్పించాలన్నారు. ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేల వల్ల అవమానాలు ఎదుర్కొవాల్సి వస్తుందని, వెంటనే తమను మాతృశాఖకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త నిరసనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేలో తప్పిదాలను సరిచేయాలి



సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

ఉదయగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేయాలని మండలంలోని బండగానిపల్లి సచివాలయం ఎదుట సోమవారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రీ సర్వేను రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ఈ-పంట నమోదు కాక, రైతు భరోసా దక్కక, బ్యాంకుల్లో రుణాలు సైతం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ తప్పిదాలను సవరించాలని రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేసినా సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సవరించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్ల నిరసన



సబ్ రిజిస్ట్రార్ మెల్కిరోషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

ఉదయగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సోమవారం దస్తావేజులేఖర్లు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా దస్తావేజులేఖర్లు మాట్లాడుతూ రిజి స్ట్రేషన్‌కు ఓటీపీ, ఆటో మ్యూటేషన్‌లకు సంబంధించి రూపొందించిన సాఫ్ట్‌వేర్ లోపభూయిష్టంగా ఉందన్నారు. ఫలితంగా తమకు, ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్త కుండా లోపాలను సరిచేసి ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ మెల్కిరోషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు దస్తావేజులేఖర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దారు మురళి, రెవెన్యూ సిబ్బంది

చేజర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లుపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 70 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్నారన్న గ్రామస్థుల పిర్యాదు మేరకు సోమవారం తహసీల్దారు బి మురళి గ్రామానికి చేరుకుని ఆక్రమణలను అడ్డుకున్నారు. పూర్తి వివరాల మేరకు.. బిల్లుపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెం.1లో సుమారు 70 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. అయితే గత వైసిపి ప్రభుత్వంలో ఈ పొలానికి సంబంధించి స్థానిక వైసిపి నాయకులు దొంగ పట్టాలు సృష్టించి కొంత భూమిని ఆక్రమించుకున్నారు. అయితే గత రెండు రోజుల క్రితం మిగతా భూమిని కూడా యంత్రాల సహాయంతో చదునుచేసి ఆక్రమించేందుకు యత్నించారు. దీంతో గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో తహసీల్దారు మురళి, రెవెన్యూ సిబ్బంది బిల్లుపాడు గ్రామానికి చేరుకుని ప్రభుత్వ వాగు, తిప్ప పోరంబోకు ఆక్రమణలను అడ్డుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా భూమిని ఆక్రమించుకున్న వారందరికీ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

పట్టుబడిన దొంగలు

- 11 బైకుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న స్కూటర్లతో సీఐ వేణు, సిబ్బంది

నెల్లూరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను అపహరించుకు వెళ్తున్న దొంగలను నెల్లూరురూరల్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వారి నుంచి 11 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను రూరల్ సీఐ గుంజి వేణు వెల్లడించారు. నెల్లూరు నగరంలోని కోటమిట్ట ప్రాంతానికి చెందిన సయ్యద్ సిద్దిక్, వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన పఠాన్ రోషన్‌లు ధనలక్ష్మీపురం కూడలిలో అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నెల్లూరురూరల్‌తో పాటు కావలి 1, 2వ టౌన్, రూరల్, గూడూరు 1, 2వ టౌన్ పరిధిలో 10 మోటారు సైకిళ్లను అపహరించుకెళ్లినట్లు అంగీకరించారు. మరో బైకును స్వాధీనం చేసుకోగా దానిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. వీటి విలువ రూ.10.4 లక్షలు ఉంటుంది. దీంతో వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. వీరిని పట్టుకోవడంలో ఎస్ఐ లక్ష్మణరావు, ఏఎస్ఐ రఫీ, కానిస్టేబుళ్లు ఆదినారాయణ, చిరంజీవి, జడపల్లి మోహన్‌కృష్ణ, మోహన్ బాబులు క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు.

వైద్యశాలలో అగ్నిప్రమాదం

- తప్పిన ముప్పు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని పొగతోటలో ఉన్న అశ్వని న్యూరో వైద్యశాలలో సిబ్బంది గదిలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసి రోగులను పక్క వైద్యశాలకు తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక అధికారుల సమాచారం మేరకు.. అశ్విని న్యూరో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం తెల్లవారు జామున పొగలు రావడంతో అప్రమత్తమైన వైద్యశాల సిబ్బంది వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది అద్దాలు పగలుగొట్టి లోపలికి ప్రవేశించి మంటలను అదుపు చేశాయి. కాగా వైద్యశాలలోని మూడవ ఫ్లోర్‌లో సిబ్బంది కోసం ఓ గదిని కేటాయించారు. మూడు రోజులుగా ఆ గదిలో ఎవ్వరు ఉండటం లేదు. అయినా గదిలో ఫ్రిజ్, గ్రీజర్‌లు ఆన్‌లో ఉండటంతో సోమవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. దీంతో గదిలోని బీరువాలో, బయట ఉన్న వస్తువులతో పాటు సిలిండర్‌కు మంటలు అంటుకున్నాయి. ఇన్‌చార్జి ఏడీఎఫ్‌వో శ్రీనాథ్‌రెడ్డి, ఎల్ఎం చంద్రశేఖర్ పర్యవేక్షణలో సంఘటన స్థలంకు చేసుకున్న అగ్నిమాపక సిబ్బంది పక్క భవనంలో నుంచి అద్దాలు పగులగొట్టుకొని పై గదిలోకి ప్రవేశించి తలుపులు పగులగొట్టి మంటలను అదుపు చేశారు. డాక్టర్ ఏ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు రూ.3 లక్షల నష్టం వాటిల్లింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కావలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీ కొని పందిటి వేంకటేశ్వర్లు (29) మృతి చెందిన సంఘటన కావలి మండలం గౌరవరం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దగదర్తి మండలం దుండిగంకు చెందిన వేంకటేశ్వర్లు మతి స్థిమితం కోల్పోయి పదేళ్లుగా ఇంటికి దూరంగా ఉంటున్నాడు. ఈక్రమంలో గౌరవరం సమీపంలోని నర్సరీ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో వేంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుమల రెడ్డి తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి ఆరోపణలపై విచారణ

- ఇరువర్గాల ఘర్షణ

మర్రిపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన పలు ఆరోపణలపై ఆత్మకూరు ఏపీవో ప్రతాప్‌రెడ్డి సోమవారం విచారిస్తుండగా రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకున్న ఘటన మర్రిపాడు మండలం కంపసముద్రంలో చోటుచేసుకుంది. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య పనులకు వెళ్లనివారికి సైతం మస్టర్లు వేసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తూ ఇటీవల జిల్లా అధికారులకు పిర్యాదు చేశారు. దీంతో ఆత్మకూరు ఏపీడి కంపసముద్రం సచివాలయంలో విచారణ చేపట్టారు. గ్రామస్థులను విచారిస్తూ, రికార్డులను పరిశీలిస్తుండగా ఫీల్డ్ అసిస్టెంట్ కు చెందిన కొంతమంది కేకలు వేసి గందరగోళం సృష్టించారు. దీంతో పిర్యాదుదారులకు ఫీల్డ్ అసిస్టెంట్ వారికి మధ్య ఘరణ, తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు కలుగజేసుకొని ఇరువర్గాలవారిని చెల్లాచెదురు చేశారు. విచారణను మధ్యలో వదిలేసి ఏపీడి ప్రతాప్‌రెడ్డి, మర్రిపాడు ఏపీవో వెంకటనారాయణ అక్కడ నుండి వెళ్లిపోయారు.

అదృశ్యమైన విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

నెల్లూరురూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఓ కళాశాలలో ఇంటర్ చదువుతూ అదృశ్యమైన సాయి అనే విద్యార్థిని అధికారులు సోమవారం అతని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ కథనం మేరకు.. నగరంలోని అన్నమయ్య సర్కిల్ ప్రాంతానికి చెందిన సాయి ఆగస్టు 14వ తేదీన కళాశాల నుంచి ఇంటికి వచ్చిన తరువాత కనిపించకుండా అదృశ్యమయ్యాడు. దీంతో అతని తల్లిదండ్రులు అనేక చోట్ల గాలించినా ఆచూకీ లేకపోవడంతో అదేనెల చివరిలో పీజీఆర్ఎస్ ద్వారా పిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు దర్యాప్తుచేయగా అతను శ్రీకాళహస్తీలో హిజ్రాలతో కలిసి ఉన్నాడని తెలిసి పోలీసులు అక్కడికి వెళ్లి ఆ విద్యార్థిని తీసుకువచ్చి సోమవారం నెల్లూరురూరల్ తహసీల్దారు కృష్ణప్రసాద్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

సారా బట్టీ ధ్వంసం

ఉదయగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి దుర్గం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా బట్టీని సోమవారం అధికారులు ధ్వంసం చేశారు. సారా బట్టీ నిర్వహణపై వివిధ పత్రికల్లో కథనాలు రావడంతో పోలీసు, ఎక్సైజ్, అటవీ శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నాటుసారా తయారీకి నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లంఊటను నేలపాలు చేశారు. అలాగే సారా తయారీకి ఏర్పాటు చేసిన బట్టీ, ఇతర సామాగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం సారా తయారీకి ఉపయోగించే వివిధ సామాగ్రి, డ్రమ్ములు ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. బట్టీ నిర్వహణలో ఎవరి హస్తముందో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, అల శ్రీను, ఎక్సైజ్ ఎస్ఐ దీప్తికరంత్, అటవీ శాఖ సిబ్బంది లక్ష్మీప్రసన్న, బచ్చల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	290

కోడిగుడ్ల ధర (100): 550

సేవా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

కావలి (టౌన్) సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) బీజేపీ సేవా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించాలని బీజేపీ నేతలు తీర్మానించారు. సోమవారం ఒకటవ పట్టణ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మందా కిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ ఈనెల 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం నుంచి అక్టోబరు 2 మహాత్మా గాంధీ జయంతి వరకు నిర్వహించబోయే పార్టీ పక్షోత్సవాల ఏర్పాట్లపై చర్చిం చారు. సెప్టెంబరు 27న పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంత్యుత్సవాల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు, జీఎస్టీ సలహా మండలి సభ్యులు అమరా సుబ్బారావు, కుట్టుబోయిన బ్రహ్మానందం, కమల, సీవీసీ సత్యం, పరుసు వెంకటేశ్వర్లు, మామిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ కేంద్రం ప్రారంభం

లింగసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలంలో మూడు వారాల క్రితం నిలిచిపోయిన ఆధార్ సేవలు సోమవారం పునః ప్రారంభమయ్యాయి. నెల రోజుల క్రితం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో కొద్ది రోజుల పాటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఈ కేంద్రానికి వచ్చి ఆధార్ సేవలు పొందారు. అయితే తర్వాత ఈ కేంద్రం ఆపరేటర్ ప్రమాదానికి గురవ్వడంతో కేంద్రం మూత పడింది. ఆధార్ సేవల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో జిల్లా ఐటీడీఏ పీడీ స్పందించి కేంద్రం తిరిగి పనిచేసేలా ప్రశాంత్, దినేష్ అనే ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. ఆధార్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్, దినేష్‌లు మాట్లాడుతూ కార్యాలయం పని వేళల్లో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపు వచ్చి తమకు అవసరమైన ఆధార్ సేవలు పొందాలని వారు కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

వలేటివారిపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం గం 2-30 లకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగునని ఎంపీడీఓ నరేంద్రదేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సమావేశానికి మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమగ్ర సమాచారంతో తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ కోరారు.

స్వామిత్వ సర్వే త్వరగా పూర్తిచేయండి

లింగసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలలో స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు సూచించారు. సోమవారం లింగసముద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటి స్థలాలను సర్వే చేసి, దానికి సంబంధించిన ధృవపత్రాలను ఇంటి యజమానులకు అందజేస్తారని చెప్పారు. దీంతో భవిష్యత్తులో ఇంటి పన్ను చెల్లించుటకు, ఇతర అవసరాలకు ఇబ్బందులు ఉండవని చెప్పారు.

రేపు, ఎల్లుండి మండల స్థాయి క్రీడాపోటీలు

కందుకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల బుధ, గురువారాల్లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె. సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, యోగ, చెస్, బ్యాడ్మింటన్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. 17న అథ్లెటిక్స్, 18న క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని జడ్పీ హైస్కూల్స్ కెజీబీవీ, మోడల్ స్కూల్‌లతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు మండల ఎస్జీఎఫ్ కోఆర్డినేటర్‌ను ఫోన్ నెం. 9848061214లో సంప్రదించాలని కోరారు.

పశువులకు 'గాలికుంటు' టీకాలు వేయించాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు వేయించి పశుసంపదను కాపాడుకోవాలని వెటర్నరీ ఏడి డాక్టర్ ఎం తోటి చెన్నకేశవులు తెలిపారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో సోమవారం గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాను స్థానిక సర్పంచ్ సాధు శ్రీలత వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడి చెన్నకేశవులు మాట్లాడుతూ 4 నెలలు దాటిన దూడల నుండి అన్ని పశువులకు డాక్టర్ల సలహాల మేరకు టీకాలు వేయించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుసేవా కేంద్రాల్లో 75 శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సబ్సిడీ పశుగ్రాసం విత్తనాలు కావల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్స్‌తో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోకూరు పశువైద్యాధికారి సుదర్శన్ సుధాకర్, డీలర్ కాకుమాను ఆంజనేయులు, సిబ్బంది ఉప్పుటూరి కిరణ్, శ్రీలత, శరత్, వినోద్ పాల్గొన్నారు.

బ్రాహ్మణక్రాక మోడల్ ప్రాథమిక పాఠశాల పరిశీలన

జలదంకి, సెప్టెంబర్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణక్రాక ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను డైట్ అధ్యాపకురాలు ఎం పద్మజ సోమవారం పరిశీలించారు. బోధన, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం అమలు తీరును ఆమె విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డ్రాపవుట్స్ తగ్గించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు టీ. శ్రీరాం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని..

● ఉపాధ్యాయులు నిరసన

కావలి (టౌన్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు స్థానిక పాత తాలూకా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ నేతలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటను విడుదల చేయాలని, పీఆర్సీ, ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ గొబ్బిళ్ల కృష్ణయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కె రఘునాథరావు, ప్రధాన కార్యదర్శి బూచి మధుసూదన్‌రావు, నాయకులు సంజీవ్, వైవీ నాగేశ్వరరావు, రామారావు, కట్ట శీనయ్య, కృష్ణప్రసాద్, రాజేష్, సుబ్రమణ్యం, మహేష్ పాల్గొన్నారు.



విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి

కావలి (టౌన్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముసునూరు వినాయకనగర్ కాలనీకి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు, సీపీఎం నేతలు విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీకి వినతి పత్రం అందించారు. వినాయకనగర్ కాలనీకి 15 సంవత్సరాలుగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయలేదన్నారు. అర కిలోమీటర్ పైనుంచి కర్రలు నాటుకుని కొంతమంది విద్యుత్ వైర్లు లాక్కున్నామని, మిగిలిన వారు చీకట్లోనే ఉంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పి పెంచలయ్య, నాయకులు జీ మధుసూదన్‌రావు, పీ తిరుపాలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్ల పెన్‌డౌన్



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు

కావలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ విధానంలో ఉన్న ఇబ్బందులు తొలగించి, సులభతరం చేయాలని కోరుతూ కావలిలో సోమవారం డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు. డాక్యుమెంట్లు రాయకుండా, స్టాంపులు ఇవ్వకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, కేవలం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్న లోపాలను సరిచేయాలని రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్, స్టాంపులు విక్రయించే సమయంలో ఓటీపీ విధానం వల్ల రిజిస్ట్రేషన్‌లో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విధానం వల్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, ఆర్థిక భారం కూడా పెరుగుతోందన్నారు. ఓటీపీ విధానాన్ని, పబ్లిక్‌డేటా విధానాన్ని రద్దు చేయాలన్నారు. అలాగే 2.0 కార్డు విధానాన్ని రద్దు చేసి పాత విధానంలోనే రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. చలానాలో వస్తున్న తప్పులను కూడా సరిచేయాలన్నారు. భవనాల రిజిస్ట్రేషన్ అనంతరం ఆటో మ్యుటేషన్ వల్ల కొన్ని లోపాలు దొర్లుతున్నాయని, వాటిని సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చలంచర్ల నాగరాజు, పీడీఎం ప్రసాద్, స్టాంప్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శేషయ్య, టీసీ మాల్యాద్రి నాయుడు, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.

మా వార్డులో మద్యం దుకాణాలు వద్దు

● ఆర్డీవోకు 13వ వార్డు ప్రజల వినతి

కావలి, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి) స్థానిక 13వ వార్డులోని రామ్మూర్తిపేట, పుల్లారెడ్డినగర్, బొడ్డుకూరువారి వీధి ప్రారంభంలో ట్రంకు రోడ్డు వద్ద బార్ అండ్‌రెస్టారెంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారని, మా ప్రాంతంలో మద్యం దుకాణం వద్దని స్థానికులు కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. సత్యనారాయణ స్వామి ఆలయం ప్రాంతంలో అనేక విద్యాసంస్థలు ఉన్నందున మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ప్రశాంతతకు భంగం కలుగుతుందన్నారు. మున్సిపల్ పార్కుకూడా ఉన్నందున సాయంత్రం పెద్దలు, పిల్లలు ఆహ్లాదం కోసం అక్కడకు వెళుతుంటారని, మద్యం దుకాణం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే తాము అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మద్యం దుకాణం వద్దంటూ ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

మద్యం బెల్టు దుకాణాలు తొలగించాలి

● అన్నవరం, చినక్రాక యువకుల డిమాండ్

జలదంకి, సెప్టెంబర్15(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్టుదుకాణాలను తొలగించాలని అన్నవరం, చినక్రాక గ్రామాలకు చెందిన దళిత యువకులు డిమాండ్ చేశారు. జలదంకిలో సోమవారం వట్టికాల గిరిబాబు, చంద్రయ్య, ఏడుకొండలు, శ్రీనివాసులు, జ్యోతి వెంకట్రావు, నేలపాటి మల్లేశ్వరరావు, గందం ప్రమోద్‌కుమార్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్వార్టర్ మద్యం బాటిల్ ధర రూ.99కు అమ్మాల్సి ఉండగా రూ.200కు విక్రయిస్తున్నారన్నారు. బెల్టు దుకాణాలు తొలగించాలని చెబితే.. అడగడానికి మీరెవరు? అంటూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. మండలంలో రూ.50 లక్షలు అడ్వాన్సు దండుకుని పేదల ఇళ్లకు మద్యం సరఫరా చేస్తూ జీవితాలతో ఆడుకుంటున్నారని వాపోయారు. ముఖ్యంగా అన్నవరం, చినక్రాక గ్రామాలలో ఈ బెల్టు దుకాణాల వల్ల తాగుబోతులు దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కావలి ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి బెల్టు దుకాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

అల్లూరులో ఆగిన రిజిస్ట్రేషన్లు

అల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అల్లూరులో దస్తావేజు లేఖరులు సోమవారం పెన్‌డౌన్ కార్యక్రమాన్ని పాటించారు. ఓటీపీ, ఆధార్ కార్డులు తదితర సమస్యలతో తమతోపాటు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఒక్క దస్తావేజును కూడా లేఖరులు దాఖలు చేయకపోవడంతో స్థానిక సబ్ రిజిస్ట్రారు కార్యాలయం రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్తంభించింది. వెనుతిరిగి వెళ్లిపోయారు.

'ఉపాధి'ని పటిష్టంగా అమలు చేయాలి



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికులు

కావలి,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. జలదంకి మండ లం తిమ్మసముద్రం, కేశవరం, కావలి రూరల్ మండలం అన్నగారిపాలెం, సింగిరిగిరివారిపాలెం, గౌరవరం గ్రామాలలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాధాక్రిష్ణ య్య, నారాయణమ్మ, తిరుపతమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

16వ వార్డులో దివ్యాంగులకు కేటాయించిన నివేశన స్థలాలు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దివ్యాంగుల కాలనీ ప్రెసిడెంట్ మండవ వెంకట్రావు కోరారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. కొందరు వీఆర్‌ఏల కుటుంబ సభ్యులు దివ్యాంగుల కాలనీలో ప్లాట్లు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు తెలిపినా స్పందించడం లేదన్నారు. దివ్యాంగుల స్థలాలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రీవెన్స్‌కు రెండు ఫిర్యాదులు

బిట్రగుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దారు సానా శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముంగమూరుకు చెందిన పట్టాదారు భూమి ప్రభుత్వ భూమిగా వస్తోందని రైతు వెంకటేశ్వర్లు వినతి పత్రం అందచేశారన్నారు. అల్లిమడుగు పంచాయతీలో భూసర్వే చేయాలని అర్జీ ఇచ్చారని తెలిపారు. ముంగమూరులో కొంత మంది వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ డీలర్లు సరుకులు ఇళ్ల వద్దకు చేర్చడం లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు రెడ్డి తహసీల్దారు దృష్టికి తీసుకువెళ్లారు. డీలర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత అభినందనీయం

కావలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని ఆనెమడుగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ వెంకటరత్నం పేర్కొన్నారు. కావలికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్లు పొన్నగంటి రాజేష్‌రామ్, ముని కావ్య దంపతులు విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. దాతలకు ఉపాధ్యాయురాలు లావణ్య కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

ఉలవపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బద్దిపూడి గ్రామంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 37 కుటుంబాలు ఆపార్టీని వీడి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు సమక్షంలో సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తొలుత గ్రామంలో ఉపాధి నిధులు రూ.16 లతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిగా నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ గ్రామాలకు మహర్దశ పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, కూనం రాఘవరెడ్డి, కూనం బ్రహ్మానందరెడ్డి, తాతిరెడ్డి ఆదినారాయణ, శ్రీనివాసులు, వేణుగోపాల్, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఇంటూరి

ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన చిలకపాటి

కందుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డైరక్టర్‌గా నియమితులైన చిలకపాటి మధుబాబు సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అవకాశం కల్పించేందుకు కృషిచేసిన ఎమ్మెల్యేకు మద్దతుగా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆయన ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లా డుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందనేందుకు చిలకపాటికి దక్కిన పదవే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధిర మధు, మహర్షి శ్రీను, బెజవాడ ప్రసాదు, చుండూరి శ్రీను, పతకమూరి వరప్రసాద్, రావూరి రామకోటయ్య, పూజల వెంకటరావు, పోలుగంగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరిస్తున్న మధుబాబు

'గాలికుంటు' టీకాలు వేయించండి

కందుకూరు నియోజకవర్గంలో ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తక్షణమే వేయించాలని ఎమ్మెల్యే ఇంటూరి కోరారు. పశుపోషకులంతా గాలికుంటువ్యాధి నివారణ ఉచిత టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంపై పశుసంవర్థక శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్‌లను సోమవారం అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టరు శ్రీధర్, అసిస్టెంటు డైరక్టర్లు జీవీ చంద్రమోహన్, వి. చెన్నకేశవులు, పశువైద్యాధికారులు వై. శ్రీకాంత్, ఎస్. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త శ్రీవర్ధన్ మృతికి నివాళి

● అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం



శ్రీవర్ధన్ తల్లిని ఓదారుస్తున్న జనసేన నేత వెంకటేశ్వర్లు

జలదంకి, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్త శ్రీవర్ధన్ ఆదివారం ఎన్‌హెచ్ 167 బీజీ రహదారిపై రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో ఉదయగిరి నియోజకవర్గ జనసేన పీఓసీ కొట్టే వెంకటేశ్వర్లు సోమవారం జలదంకిలో శ్రీవర్ధన్ మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి తల్లిని ఓదార్చి అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా కొట్టే వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ జనసేనలో చురుకైన కార్యకర్త శ్రీవర్ధన్ అని, ఆదివారం కావలి వైపు నుండి ట్రాక్టర్ నడుపుతూ జలదంకి వస్తూ రోడ్డుప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ తరఫున మృతుడి కుటుంబాన్ని ఆదుకునేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు తోట మురళి, జలదంకి పీఏసీఎస్ డైరెక్టర్ జానీ, నియోజకవర్గ నేత నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల దూరం

ఉలవపాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది సూచించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కరేడు పరిధి గ్రామాలైన మన్నేటికోట, ఉలవపాడు, కరేడు గ్రామాల్లో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించినట్లు వైద్యధికారి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఇంటి ఆవరణలో పనికిరాని వస్తువులు, వాడని వస్తువులలో నీటి నిల్వలు ఉన్నందున డెంగ్యూ దోమలు గుడ్లుపెట్టి అభివృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. ఇంటింటి సందర్శనలో ప్రజలకు అవగాహన కల్పిస్తు వాడకంలోలేని వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని వైద్యఆరోగ్య సిబ్బంది దగ్గరుండి తొలగించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఉలవపాడు పంచాయతీ, వైద్యఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా గ్రామంలో ఫాగింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నాగలక్ష్మీ, కార్యదర్శి వీరయ్య, కందుకూరు సబ్‌యూనిట్ అధికారి రామారావు, సూపర్‌వైజర్లు, ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని డ్రైవర్ మృతి

కావలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం ముసునూరు జాతీయ రహదారిపై లారీ టైరు మారుస్తుండగా వెనుక నుండి మరో లారీ ఢీకొనడంతో టైరు మారుస్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్ హజగర్‌ఖాన్(39) మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. కలకత్తా నుండి కోయంబత్తూరుకు వెళుతున్న రెండు లారీలు సోమవారం మధ్యాహ్నం ముసునూరు జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి పైకి చేరుకున్నాయి. ముందు వెళ్తున్న లారీ టైరు పగిలిపోవడంతో ఆ లారీని రోడ్డు మార్జిన్ లో ఆపి, డ్రైవర్ టైరు విప్పుతుండగా వెనుకనుండి మరో లారీ వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ హజగర్‌ఖాన్‌ను 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సకాలంలో సమాచారం అందలేదని తెలిసింది.

పెట్రేగిపోతున్న పెట్రోల్ దొంగలు

● మోటారు బైకుల వైర్లు కత్తిరించి పెట్రోల్ చోరీ

● ముసునూరు ఇందిరమ్మ కాలనీలో వరుస దొంగతనాలు

కావలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు ఇందిరమ్మ కాలనీలో పెట్రోల్ దొంగలు పెట్రేగిపోతున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అట్టల ఫ్యాక్టరీ కాలనీ సమీపంలో నివశించే కాళిదాసు ఆనంద్ ఇంటి ముందు మోటారు బైక్ పార్కు చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి పైపులు కత్తిరించి పెట్రోల్ చోరీ చేశారు. వారం రోజుల క్రితం అదే వీధిలో పెయింటర్ పెద్దిపోగు కిషోర్ మోటారు బైకు నుంచి పైపులు కత్తిరించి పెట్రోల్ దొంగిలించారు. ఆ ప్రాంతంలో అందరూ దినసరి కూలీలు కావడంతో వరుస పెట్రోల్ దొంగతనాలతో లబోదిబోమంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గత 10 రోజులుగా వరుసగా పెట్రోల్ దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల సంచారం ఎక్కువగా జరుగుతుందని, అర్ధరాత్రిళ్ల వరకు రోడ్ల వెంట తిష్టవేసి ఉంటుండటంతో అనేక అనుమానాలకు తావిస్తోందని చెబుతున్నారు. మత్తుపదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. గుర్తు తెలియని వ్యక్తుల సంచారంపై పోలీసులు దృష్టిసారించాలని, రాత్రివేళల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యుత్ లోఓల్టేజ్ సమస్య పరిష్కరిస్తాం

బిట్రగుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ మసీదువీధిలో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరిస్తామని ఏఈ జడరాయ తెలిపారు. కొన్నేళ్ళ క్రితం ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చాలని టీడీపీ నేతలు సీహెచ్. వెంకటేశ్వర్లు, సుభాని కోరడంతో సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ద్వారా విద్యుత్ సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే ఎస్టిమేషన్లు పంపించడమే కాకుండా విద్యుత్ ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

కావలి (టౌన్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం వెంగళరావునగర్‌లోని విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు ఎస్‌కె సందాని మాట్లాడుతూ పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జేఎల్ఎం గ్రేడ్ 2లను, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈఈ బెనర్జీ, ఏఈ వసంతరావు, కార్యాలయ అధికారులు, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలి

లింగసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండరాయునిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని ముక్తేశ్వరం ఎస్సీ కాలనీకి చెందిన శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమణ నుండి విడిపించాలని నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, ఆ కాలనీవాసులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో వారు తహసీల్దార్ ఎం కోటేశ్వరరావుకు ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించి చదును చేసి తమ పొలంలో కలుపుకున్నారని తహసీల్దార్ కోటేశ్వరరావుకు వివరించారు. ఆక్రమణదారుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఎస్సీలకు న్యాయం చేయాలన్నారు. దీంతో ఆయన స్పందించి మంగళవారం శ్మశానవాటిక స్థలాన్ని ఆర్ఐ, వీఆర్ఓ, సర్వేయరు ద్వారా కొలిపించి, హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో గౌడపేరు రత్నం, యేసేబు, ఆనంద్, బాలయ్య, సురేష్, రమేష్, మల్లిఖార్జున, దావీదు, ప్రసాదు, రాజేష్, కొండయ్య, మోజేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న మోషే, కాలనీవాసులు





ఆలకిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి విజయానంద్

- శ్రీసిటీ భూసేకరణలో అడ్డంకులు తొలగించాలి
- పులికాట్ పూడికతీత పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలి
- సీఎం చంద్రబాబును కోరిన కలెక్టర్ వెంకటేశ్వర్

జిల్లా అభివృద్ధికి నిధులు కావాలి

తిరుపతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి నిధులు కావాలంటూ సీఎం చంద్రబాబును కలెక్టర్ వెంకటేశ్వర్ అభ్యర్థించారు. అమరావతిలో సీఎం అధ్యక్షతన సోమవారం మొదలైన 4వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. శ్రీసిటీకి అదనంగా 2500 ఎకరాలు కేటాయించాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూసేకరణ చేస్తున్నామని వివరించారు. అయితే, దీనికి సంబంధించి పలు కోర్టు కేసులు పెండింగులో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. పులికాట్ సరస్సుకు సంబంధించి పూడి రాయి దొరువు వద్ద సముద్ర ముఖ ద్వారాలు పూడిపోవడంతో పూడికతీతకు రూ. 97 కోట్లు నిధులు విడుదలయ్యాయని, కానీ పనులు చేపట్టడంలో ఆలస్యం జరుగుతోందని సీఎంకు నివేదించారు. కలెక్టర్ అభ్యర్థనలకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. అంతకు మునుపు తొలిరోజు నిర్దేశిత శాఖలపై జరిగిన చర్చ సందర్భంగా జిల్లాలో పథకాలు, కార్యక్రమాల అమలు తీరును సీఎం సమీక్షించారు. ముఖ్యంగా పారిశ్రామిక పెట్టుబడులు, పీ4 అమలు, సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.

జిల్లా స్థూల ఉత్పత్తి రూ.20,160 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ ప్రభుత్వం నిర్దేశించిన జిల్లా స్థూల ఉత్పత్తి లక్ష్యం రూ.1.08 లక్షల కోట్లు. తొలి త్రైమాసికంలో రూ.20.160 కోట్లు సాధించింది. వార్షిక పెరుగుదల రేటు లక్ష్యం 18.77 శాతం కాగా.. మూడు నెలల్లో 18.55 శాతం సాధించింది. జీడీపీ లక్ష్య సాధనలో జిల్లా 17వ స్థానంలో వుంది.

వ్యవసాయ ఉత్పత్తుల్లో 13వ స్థానం

వ్యవసాయ రంగ ఉత్పత్తుల విలువ లక్ష్యం రూ.19,487 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీనికిగానూ మొదటి మూడు నెలల్లో జిల్లా రూ.2,458 కోట్లు సాధించి 13వ స్థానంలో ఉంది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో జిల్లా 21 పాయింట్లతో స్కోర్ బోర్డులో సీ గ్రేడ్‌లో నిలిచింది. జిల్లాలపరంగా అట్టడుగున 26వ స్థానంలో ఉంది.

పారిశ్రామిక ఉత్పత్తుల విలువ రూ.7880 కోట్లు

జిల్లాలో పారిశ్రామిక ఉత్పత్తుల విలువ లక్ష్యం రూ. 43,068 కోట్లు. తొలి మూడు నెలలకు రూ.7990 కోట్లు సాధించి 24వ స్థానంలో ఉంది. స్కోర్ బోర్డు పరంగా 54 పాయింట్లతో బి గ్రేడ్ దక్కగా, జిల్లా 22వ స్థానంలో ఉంది.

పాల ఉత్పత్తి పెంచుకునేందుకు అవకాశం

2024-25లో పశు సంవర్థక శాఖకు సంబంధించి ఉత్పత్తుల విలువ రూ.8028 కోట్లు. ఆ విలువ పరంగా జిల్లా 11వ స్థానంలో వుంది. పాల ఉత్పత్తిని పెంచుకునేందుకు అవకాశాలున్నాయని ప్రభుత్వం గుర్తించి.. ఆ దిశగా కృషి చేయాలని ఆదేశించింది.



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్

స్వర్ణాంధ్రలో బి గ్రేడ్

స్వర్ణాంధ్రలో జిల్లాకు బి గ్రేడ్ దక్కింది. స్కోర్ బోర్డులో 60 పాయింట్లు వచ్చాయి.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

- తిరుపతిలో ముగిసిన రెండు రోజుల సదస్సు
- నేడు స్వస్థలాలకు డెలిగేట్లు



వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, పురందేశ్వరి, రఘురామకృష్ణంరాజు, అయ్యన్న పాత్రుడు, ఓం బిర్లా, హరివంశ్‌నారాయణ్‌సింగ్, జకియాఖానం, గౌరు చరితారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ సాధించాలంటే.. మహిళల ఆర్థిక సాధికారత కీలకం. ఈ దిశగా అడుగులు వేసేలా రెండు రోజులపాటు తిరుపతిలోని రాహల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన జాతీయ మహిళా సాధికారత సదస్సు దోహదపడింది. మహిళల ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, ఆర్థికాభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, సైబర్ భద్రత కల్పించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని సదస్సు చర్చించింది. ఈ సదస్సుకు లోక్‌సభ, రాజ్యసభ, 20కిపైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టసభల సాధికారత కమిటీలకు సంబంధించి 200మందికిపైగా వచ్చారు. తొలి రోజు సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరు కావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణంతో ఆయన పర్యటన రద్దయింది. రెండో రోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటి రోజు సదస్సులో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై విడతల వారిగా సభ్యులు చర్చించారు. వాటిపరిష్కారానికి పలు తీర్మానాలు చేశారు. రెండో రోజైన సోమవారం మహిళా సాధికారత కమిటీలు చర్చించిన పలు తీర్మానాలను ఆమోదిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఇక డెలిగేట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏపీ అసెంబ్లీ, జిల్లా యంత్రాంగం సమష్టిగా కృషి చేసింది. కాగా, దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల నుంచీ మహిళా ప్రతినిధుల బృందాలు వచ్చాయి. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, పార్లమెంటరీ మహిళా సాధికారత అధ్యక్షురాలు పురందేశ్వరి ఆయా బృందాల వద్దకెళ్లి యోగక్షేమాలతోపాటు బస, వసతి తదితరాలను గురించి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడించేలా సాధికారత సదస్సు నిర్వహించామని, అందుకు కారణం జిల్లా యంత్రాంగం పాత్ర చాలా కీలకమని స్పీకర్ ప్రశంసించారు. సదస్సు ముగిసిన వెంటనే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేశారు. ఉదయం తిరుమల శ్రీవారిని, మధ్యాహ్నం శ్రీకాళహస్తీశ్వరుడిని పలువురు డెలిగేట్లు దర్శించుకున్నారు. తొలిరోజు రాత్రి చంద్రగిరి కోటలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున రాహల్ కన్వెన్షన్ సెంటర్‌లో తిరుపతి కమిషనర్ మౌర్య పర్యవేక్షణలో డెలిగేట్లకు ఆత్మీయవిందు ఇచ్చారు. కాగా, ప్రతినిధులు మంగళవారం ఉదయం వారి స్వస్థలాలకు బయలుదేరి వెళ్లనున్నారు.



రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం రాత్రి కమిషనరు మౌర్య ఆధ్వర్యంలో అతిథులకు విందు

రేపు తిరుచానూరు స్టేషన్‌కు
తొలి రైలు

తిరుపతి, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రైల్వే స్టేషన్‌కు తొలి రైలు వచ్చే సమయం ఆసన్నమైంది. మంగళవారం సాయంత్రం 4.50 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి బుధవారం ఉదయం 11.30 గంటలకు తిరుపతి-రేణిగుంట మధ్యలోని తిరుచానూరు నూతన రైల్వే స్టేషన్‌కు చేరుకోనుంది. అక్కడ నుంచి అదేరోజు సాయంత్రం 6.40 గంటలకు తిరుగుప్రయాణం కానుంది. అదేవిధంగా ఈనెల 23, 30 తేదీల్లోనూ ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు తిరుచానూరుకు రాకపోకలు సాగించనున్నట్టు రైల్వేవర్గాలు చెబుతున్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి హైదరాబాద్ మీదుగా తిరుచానూరు స్టేషన్‌కు చేరుకునే అవకాశం ఈ రైలు ద్వారా ప్రయాణికులకు కలగనుంది. తిరుపతి, రేణిగుంట రైల్వే స్టేషన్లపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో తిరుచానూరు రైల్వే స్టేషన్‌ను చదలవాడ విద్యాసంస్థల సమీపంలో నిర్మించారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు మధ్యాహ్నం 12 గంటలకు అన్నమయ్య భవనంలో సమావేశం జరుగుతుంది. ప్రధానంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవ ఏర్పాట్లపైనే చర్చ జరుగనుంది. వాహనసేవలను వీక్షించేందుకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనసేవల నిర్వాహణ వంటి వివిధ అంశాలపై చర్చించనున్నారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. సాధారణంగా ఏడాదిలో ఉగాది, వైకుంఠ ఏకాదశి, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాల ముందు వచ్చే మంగళవారం రోజున కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలోనే ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.


19న పద్మావతి వర్సిటీలో ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈనెల 19వ తేదీన ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎంబీఏ విభాగంలో సంప్రదించవచ్చు. సమగ్ర సమాచారం కోసం ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్‌ను చూడవచ్చునని పద్మావతి వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు.

1408మంది కొత్త పంతుళ్లు

- డీఎస్సీ విజేతల జాబితా ప్రకటించిన విద్యాశాఖ
- శిక్షణ అనంతరం విధుల్లో చేరనున్న టీచర్లు
- అభ్యంతరాల స్వీకరణకు హెల్ప్‌డెస్క్‌లో అవకాశం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తాజా డీఎస్సీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1408మంది (95.26 శాతం) తుది ఎంపిక జాబితాలో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. గత ఏడాది జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది.ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది.దరఖాస్తుల స్వీకరణతో ఈ ఏడాది ఏప్రిల్ 20న మొదలైన ప్రక్రియ పలు దశలు సాగి ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1408 అభ్యర్థులు (95.26 శాతం) తుది ఎంపిక జాబితాలో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించినట్లు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సోమవారం ప్రకటించింది.ఫైనల్ సెలక్షన్ జాబితాను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌తో పాటు చిత్తూరు డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లోని 84989 91250 నెంబరులో సంప్రదించాలని డీఈవో వరలక్ష్మి సూచించారు. వివిధ కారణాలతో మిగిలిన 70 పోస్టులను వచ్చే ఏడాది నిర్వహించే డీఎస్సీలో భర్తీ చేయనున్నారు. నూతన ఉపాధ్యాయులకు దసరా సెలవుల సమయంలో అంటే 22 నుంచి 29వ తేది వరకు ఎనిమిది రోజుల పాటు ట్రైనింగ్ కార్యక్రమం చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తారు. బోధన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు నిజాయితీ, నిబద్ధత, అంకితభావతో సేవలందించేలా వారికి సూచించనున్నారు. ట్రైనింగ్ సమయంలో కౌన్సిలింగ్ నిర్వహించి, ప్లేస్‌మెంట్ ఆర్డర్ (ప్లేస్ ఆఫ్ పోస్టింగ్ ఆర్డర్) జారీ చేయనున్నారు. ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి కాగానే నూతన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంది.



యాజమాన్యాల వారీగా భర్తీ చేసిన పోస్టులు

యాజమాన్యం	నోటిఫైడ్ పోస్టులు	భర్తీ చేసినవి	భర్తీ చేయనివి
ప్రభుత్వ/లోకల్‌బాడీ	1312	1254	58
మున్సిపాలిటీ	64	57	7
మున్సిపల్ కార్పొరేషన్	97	92	5
ట్రైబల్ వెల్ఫేర్/ఆశ్రమ	5	5	0
మొత్తం	1478	1408	70

● సబ్జెక్టులు/పోస్టుల వారిగా...

సబ్జెక్టు/పోస్టు	నోటిఫైడ్ పోస్టులు	భర్తీ చేసినవి	భర్తీ చేయనివి
ఎస్ఏ(ఎల్)ఇంగ్లీష్	104	102	2
ఎస్ఏ(ఎల్)హిందీ	17	16	1
ఎస్ఏ(ఎల్)తెలుగు	33	33	0
ఎస్ఏ(ఎల్)ఉర్దూ	4	2	2
ఎస్ఏ(ఎల్)తమిళం	1	-	1
ఎస్ఏ(ఎన్ఎల్)బయాలజీ	60	59	1
ఎస్ఏ(ఎన్ఎల్)బయాలజీ (త)	3	2	1
ఎస్ఏ(ఎన్ఎల్)బయాలజీ (ఉ)	1	1	0
ఎస్ఏ(ఎన్ఎల్)మ్యాథమెటిక్స్	28	27	1
ఎస్ఏ(ఎన్ఎల్)మ్యాథమెటిక్స్(త)	2	1	1
ఎస్ఏ(ఎన్ఎల్)మ్యాథమెటిక్స్(ఉ)	1	1	0
ఎస్ఏ(ఎన్ఎల్)పీడీ	86	86	0
ఎస్ఏ(ఎన్ఎల్)ఫిజికల్ సైన్స్	29	29	0
ఎస్ఏ(ఎన్ఎల్)ఫిజికల్ సైన్స్(త)	1	-	1
ఎస్ఏ(ఎన్ఎల్) సోషియల్ స్టడీస్	118	117	1
ఎస్ఏ(ఎన్ఎల్)సోషియల్ (త)	5	5	0
ఎస్ఏ(ఎన్ఎల్)సోషియల్ (ఉ)	7	5	2
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)	891	885	6
ఎస్జీటీ (తమిళం)	7	5	2
ఎస్జీటీ(ఉర్దూ)	80	32	48
మొత్తం	1478	1408	70

టీటీడీ నుంచి రాజగోపాల్ రిలీవ్

తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆల్ ప్రాజెక్ట్స్ ప్రోగ్రాం ఆఫీసర్, శ్వేత ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా ఉన్న రాజగోపాల్ సోమవారం టీటీడీ నుంచి రిలీవ్ అయ్యారు. గత ప్రభుత్వంలో ఆయన డిప్యుటేషన్‌పై టీటీడీకి వచ్చిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో తాత్కాలికంగా టీటీడీ తిరుపతి ఎస్టేట్ ఆఫీసర్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చినట్టు సమాచారం. ఇక, దీంతోపాటు టీటీడీలో డిప్యుటేషన్‌పై వచ్చి ఇప్పటికీ కొనసాగుతున్న మరికొంతమంది అధికారులను కూడా టీటీడీ నుంచి పంపించే దిశగా ఇప్పటికే ఉన్నతాధికారులు ఫైల్‌ను సిద్ధం చేసినట్టు సమాచారం. కాగా, బ్రహ్మోత్సవాల ముందు ఈ అధికారులను కదిలించే ప్రక్రియ ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

ప్రొ కబడ్డీ లీగ్ అంపైర్‌గా వెంకటగిరి మహిళ



శ్రీదేవి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 9వ బెటాలియన్‌కు చెందిన కోమటి రవికుమార్ భార్య శ్రీదేవి ప్రొ కబడ్డీ లీగ్ అంపైర్‌గా ఎంపికయ్యారు. ఆగస్టు 29 నుంచి నవంబరు 1వ తేదీ వరకు వైజాగ్, జైపూర్, చెన్నై, ఢిల్లీ నగరాల్లో జరగనున్న 12వ సెషన్ ప్రొ కబడ్డీ లీగ్ పోటీలకు శ్రీదేవి అంపైర్‌గా వ్యవహరించనున్నారు.

తిరుమల చేరుకున్న గవర్నర్ నజీర్



తిరుమల, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. విధాత నిలయం(రచన)కు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం పోలీసు సిబ్బంది గవర్నర్‌కు గౌరవ వందనం సమర్పించారు. రిసెప్షన్ అధికారులు బస, దర్శన ఏర్పాట్లు చేశారు. వెంగమాంబ అన్నప్రసాద భవనానికి వెళ్లిన ఆయన భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

టీటీడీకి ఎలక్ట్రిక్ వ్యాన్ విరాళం

తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సోమవారం ఓ ఎలక్ట్రిక్ వ్యాన్ విరాళంగా అందింది. బెంగళూరుకు చెందిన టీవోల్ట్ ఎలక్ట్రిక్ వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.15.94 లక్షల విలువైన మొంట్రా ఎలక్ట్రిక్ ఏవియేటర్(ఈ-ఎస్‌సీవీ) వాహనాన్ని అందజేసింది. ఈమేరకు సోమవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంస్థ ప్రతినిధులు తాళాలను శ్రీవారి ఆలయ డిప్యూటీఈవో లోకనాథానికి అందజేశారు.



శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో మూడు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- శనివారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,893
- తలనీలాలు సమర్పించినవారు: 24,604



గ్యాలరీల్లో 1.85 లక్షల మంది

- వాహన సేవలు వీక్షించే అవకాశం
- తప్పుడు ప్రచారానికి కౌంటర్ చేసేందుకు ప్రత్యేక టీమ్‌లు
- టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో 24 నుంచి జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. మాడవీధుల్లోని గ్యాలరీల్లో 1.85 లక్షల మంది భక్తులు కూర్చుని వాహన సేవలను వీక్షించే అవకాశముందన్నారు. రీఫిల్లింగ్ ద్వారా మరో 15 వేల మందికి కూడా వాహనసేవల దర్శనం లభిస్తుందన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఎస్పీ సుబ్బరాయుడు, విజిలెన్స్ సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులతో సోమవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్మెంట్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా రోజుకు 435 బస్సులు నడుస్తున్నాయని, దీని ద్వారా రోజుకు సుమారు 1.60 లక్షల మంది భక్తులు పికప్, డ్రాప్ సౌకర్యం కల్పించవచ్చన్నారు. ట్రాఫిక్ సమస్యను తగ్గించేలా వీలైంతన వరకు భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. తిరుపతిలో 23 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. గ్యాలరీల్లోకి చేరుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. 4,200 మంది పోలీసులు, 1,500 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా క్రౌడ్ మూవ్‌మెంట్, రద్దీ పాయింట్లను రియల్ టైం మానిటరింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. సీఎం, రాజ్యాంగపరమైన అధినేతలు, వీఐపీల రాకపోకలకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. సోషల్ మీడియాలో తప్పుదారి పట్టించే ప్రచారాన్ని వెంటనే కౌంటర్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీలు, వీఎస్వోలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 16 నుంచి ఎస్వీయూలో యువ తరంగ్

పోస్టర్లు ఆవిష్కరించిన వీసీ, రిజిస్ట్రార్, శాప్ చైర్మన్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, శాప్ చైర్మన్ రవినాయుడు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబరు 16వ తేదీ నుంచి యువతరంగ్-2025 నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎస్వీయూలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, శాప్ చైర్మన్ రవినాయుడు ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ అక్టోబరు 16 నుంచి యూనివర్సిటీ వేదికగా మూడు రోజులు డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులకు అంతర యూనివర్సిటీల సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వక్తృత్వ, సంగీత, నృత్య, థియేటర్ ఆర్ట్స్ వంటి 10 అంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ యువ తరంగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యూనివర్సిటీ సాంస్కృతిక ఔన్నత్యాన్ని పెంపొందించ డానికి ప్రయత్నించాలన్నారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ యూనివర్సిటీ క్రీడా, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ టీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ 40డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులు యువ తరంగ్‌లో పాల్గొంటున్నట్టు చెప్పారు. ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పద్మావతి, మీడియా డీన్ పీసీ వేంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కో కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. మీ వేషాలు నా దగ్గర కాదు!

- సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కని శానిటేషన్ వర్కర్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంత చదువుకున్నా.. ఎంత పరిజ్ఞానమున్నా సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మేవాళ్లే ఎక్కువ. వాళ్ల ఉచ్చులోపడి లబోదిబోమనే వాళ్లే. కానీ, తిరుపతికి చెందిన శానిటేషన్ వర్కర్ ఒకరు మాత్రం మీ వేషాలు నా దగ్గర కాదంటూ సోమవారం తనకు ఫోనుచేసిన అమ్మాయికి దీటుగా ఎదురు తిరిగారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతికి చెందిన దొరరాజు మధుసూదనరాజు టీటీడీ పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు 87459 85232 నెంబరు నుంచి వాట్సాప్ ఫోను వచ్చింది. వాట్సాప్ పిక్‌గా 'స్కాలర్‌షిప్ డిపార్టుమెంటు' అని ఉంది. మీ కుమారుడు రోహిత్ కుమార్ రాజుకు ప్రభుత్వం స్కాలర్ షిప్ కింద రూ.38,500 మంజూరు చేసిందంటూ ఓ యువతి చెప్పింది. మీకు ఫోనుపే ద్వారా జమ చేశామంటూ స్క్రీన్ షాట్ పెట్టింది. స్క్రీన్ షాట్‌లో ఆ మొత్తం జమ చేసినట్లుగా ఉంది. దీనికిగాను తమకు కమీషను కింద వెంటనే డబ్బు పంపాలని తొందర చేసింది. నీ అకౌంటులో రూ.మూడు వేలు ఉంది కదా.. దానిని పంపండని ఆమె ఒత్తిడి తెచ్చింది. ఈయన మాత్రం తన తన అకౌంటులో బ్యాలెన్సు చెక్ చేయగా, జమ కాలేదని తెలిసింది. మీరు డబ్బు పంపండి.. మళ్ళీ స్కాలర్ షిప్ అమౌంటుతో కలిపి మీకు పంపుతామంటూ ఆమె చెప్పినా ఆయన గట్టిగా నిలదీశారు. దీంతో ఆమె ఫోను స్విచ్ ఆఫ్ చేసింది. ఇలాంటి ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

అవగాహనతో ప్రాణాంతక వ్యాధుల నిర్మూలన



తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక వ్యాధులపై అవగాహన ఉన్నప్పుడే పూర్తిగా నిర్మూలించే అవకాశం ఉంటుందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో ఆయన సోమవారం మొబైల్ ఐఈసీ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్, లెప్రసీ, టీబీ వ్యాధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎయిడ్స్, లెప్రసీ, టీబీ వ్యాధులకు సంబంధించిన ప్రచార పుస్తకాలు, పత్రికలను ఆవిష్కరించారు. వైద్యాధికారులు శైలజ, కోటిరెడ్డి, సురేంద్ర, మంజునాథ్, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రాధాన్యతతోనే సాధికారత సాకారం

- మహిళా ప్రజాప్రతినిధుల వాణి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం ముఖ్యం..ఆర్థికంగా, సామాజికంగా వారికి సమాన హక్కులు కల్పిస్తే ఇది సాధ్యం.. దేశ గమనాన్ని నిర్దేశించే రాజకీయాల్లో భూమిక మరింత పెరగాలి. అప్పుడే భారతావనిలో మహిళా సాధికారత సాకారమవుతుంది. తిరుపతిలో రెండోరోజు(సోమవారం) జరిగిన జాతీయ మహిళా సాధికారత సమావేశంలో పాల్గొన్న పలువురు మహిళా ప్రజాప్రతినిధులు వ్యక్తం చేసిన అభిప్రాయాలివి..వారేమన్నారంటే...



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మహిళా ప్రజాప్రతినిధులు

అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలి



రాజకీయంగానే కాకుండా ఇతర రంగాల్లోనూ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు ప్రాధాన్యత కల్పించాలి. ప్రస్తుతం మైనార్టీ మహిళలు కూడా మరింతమంది రాజకీయాల్లోకి రావడం శుభపరిమానం. ఆ దిశగా వారు ముందుకు రావడం అభినందనీయం. ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు మహిళలకు అగ్రాసనమేస్తున్నారు. ఇలాంటి సదస్సులు మహిళలు మరింత ముందుకు సాగడానికి ప్రేరణనిస్తాయి.

- జకియాఖానం, ఏపీ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్

తీర్మానాలు అమలైతేనే సార్థకత



జాతీయ సాధికారత సదస్సులో మహిళాభ్యున్నతికి చేసిన తీర్మానాలను చట్టసభలో కూడా ఆమోదించాలి. వాటిని అమలు చేయాలన్నారు. అపుడే వాటికి సార్థకత లభిస్తుంది. పంచాయతీ నుంచి అసెంబ్లీ వరకు మహిళకు రాజకీయాల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. ఆడ బిడ్డల భవిష్యత్తుకు ప్రభుత్వాలు మరన్ని చట్టాలు తెవాల్సి ఉంది. ఈ శతాబ్దంలో కూడా మహిళలు తమ సమస్యలపై పోరాడాల్సి వస్తోంది.

- తారహై కుత్‌బ్రెట్, ఎమ్మెల్యే, తమిళనాడు

సదస్సు చరిత్రలో ఓ మైలురాయి



మహిళాభివృద్ధికి తొలిసారిగా జాతీయ మహిళ సాధికారత సదస్సు నిర్వహించడం శుభపరిణామం. ఇది చరిత్రలో ఓ మైలురాయిలా నిలుస్తుంది. కేరళలో మహిళా అభివృద్ధికి అక్కడి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టింది. పురుషులతో పోలిస్తే మహిళ అక్షరాస్యత శాతం కూడా ఎక్కువే. మహిళలు మరింత ఎదగాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి.

- ప్రతిభ, మహిళసాధికారత చైర్‌పర్సన్,కేరళ

మరిన్ని పథకాలు అవసరం



మహిళల రక్షణ, స్వావలంబనకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు మరిన్ని పథకాలు తేవాలి. విద్య,ఆర్థిక, నైపుణ్యాభివృద్ధితోనే మహిళా సాధికారత కల సాఫల్యమవుతుంది. చిన్నప్పటి నుంచి విద్య అందించడం, లింగ వివక్షత రూపుమాపడం, సమాన అవకాశాలు కల్పించడం ద్వారా రాజకీయ సామాజిక రంగాల్లో మహిళలు రాణించడానికి వీలవుతుంది. కేరళలో మహిళలు కూడా వందశాతం అక్షరాస్యత సాధించారు.

- శాంతకుమారి, కోంగడ్ ఎమ్మెల్యే, కేరళ

మహిళా ఎమ్మెల్యేల సంఖ్యే సాధికారతకు దర్పణం

మహిళలను ఒక శక్తిగా చూడాలన్నది సీఎం చంద్రబాబునాయుడు సంకల్పం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో 22మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉండటం చంద్రబాబు దార్శనికతకు దర్పణం. ఆర్థికంగా, రాజకీయంగా మహిళలు ఎదిగితేనే సాధికారత సాకారమవుతుంది. ఈ దిశగానే రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది.

- మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం ఎమ్మెల్యే



సదస్సుతో సాధికారతకు బాట



తొలిజాతీయ మహిళా సాధికారత సదస్సు తిరుపతి కేంద్రంగా నిర్వహించడం గర్వకారణంగా ఉంది. ఈ సదస్సులో చేసిన తీర్మానాలు మహిళాలోకానికి ఎంతగానో ఉపయోపడతాయి. మహిళలకు అధికారం, ఆర్థికంగా ఎదగడానికి సదస్సు బాటలు వేస్తుంది. సదస్సు నిర్వహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు.

- ఎ.మధుసూదన్, ఎమ్మెల్సీ

సూపర్‌సిక్స్‌లో నాలుగు స్త్రీలకే..



మహిళ సాధికారతను కూటమి ప్రభుత్వం ఆచరణ సాధ్యం చేస్తోంది. సీఎం చంద్రబాబు ఈ విషయంలో నిబద్ధతతో పనిచేస్తున్నారు. అందుకు పథకాల్లో మహిళలకే పెద్ద పీట వేస్తున్నారు. సూపర్‌సిక్స్‌లో నాలుగు పథకాలు మహిళలకే కేటాయించిన ఘనత చంద్రబాబుకు దక్కింది. సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వడం సంతోషం.

- గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే







సదస్సు గురుతులు : సదస్సుకు హాజరైన డెలిగేట్ల సెల్ఫీ - ఫొటో తీసుకుంటూ - శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహిళా ప్రజాప్రతినిధులు



శ్రీవారి ఆలయంలో నవీన్‌చంద్ర రాంగులామ్ దంపతులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్ తదితరులు

కృతజ్ఞతలు తెలపడానికి వచ్చా

- సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమానికి మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర



మారిషస్ ప్రధాని నవీన్‌చంద్రకు బొట్టు పెడుతున్న గురువానంద

రామచంద్రాపురం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): 'సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమ పీఠాధిపతి గురవానంద గురూజీ ఆశీర్వాదంతోనే నేను నాలుగోసారి మారిషస్ ప్రధానినయ్యా. అందుకు కృతజ్ఞతలు తెలపడానికి ఆశ్రమానికి వచ్చా' నని నవీన్‌చంద్ర రాంగులామ్ చెప్పారు రామచంద్రాపురం మండలం సి.రామాపురం సమీపంలోని బ్రహ్మర్షి గురూజీ సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమాన్ని సోమవారం మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులాం, వీణా రామ్‌గులాం దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబరు 15న మారిషస్‌లో తాను గురువానంద గురూజీని కలవగా, నవంబరు 13లోపు ప్రధానమంత్రి అవుతావని చెప్పారన్నారు. ఆ ప్రకారం కావడంతో ఆశ్రమానికి వచ్చి ఆయన్ను కలిశానని తెలిపారు. నవీనచంద్ర చేపట్టిన ప్రజాసేవకు గుర్తింపుగా ఇప్పటికే నాలుగు పర్యాయాలు మారిషస్ ప్రధానమంత్రి అయ్యారని గురువానంద గురూజీ తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాన రాజ్యసభ సభ్యుడు రవిచంద్రారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులున్నారు. అనంతరం మారిషస్ ప్రధాని దంపతులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరగా జేసీ శుభం బన్సల్, ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు రాజేష్, శాంతిలాల్, సరళ, ఆసీస్‌మెహతా తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం నవీన్‌చంద్ర దంపతులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

అడవిలో మృతదేహాలపై వీడని మిస్టరీ

హత్య కోణంలోనూ అనుమానాలు ● రెండు గోతుల్లో ఏముందో తేలేది రేపే





మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

పాకాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పనపాకం రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఇద్దరి వ్యక్తుల మృతదేహాల గుర్తింపులో చిక్కుముడి వీడలేదు. ఇక్కడి అడవిలో రెండు మృతదేహాలను ఆదివారం సాయంత్రం గొర్రెల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చిన విషయం తెలిసిందే. సీఐ సుదర్శన్ ప్రసాద్, తహసీల్దార్ సంతోష్ సాయి, సిబ్బంది సోమవారం వెళ్లి పరిశీలించారు. చెట్టుకు వేలాడుతున్న పురుషుడి మృతదేహాన్ని కిందికి దించారు. దీనితోపాటు అక్కడే కిందఉన్న మహిళ మృతదేహానికి సాయంత్రం వైద్యులు అక్కడే పోస్టుమార్టం చేశారు. ఇవి కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండటతో అక్కడే ఖననం చేశారు. ఫోరెన్సిక్ క్లూస్ టీమ్ పరిసరాల్లో ఆనవాళ్లు సేకరించింది. కాగా పక్కనే రెండు గోతుల్లో చిన్నారుల మృతదేహాలు ఉన్నాయని భావిస్తున్నారు. గుంతలు తవ్వేందుకు ప్రయత్నించేలోగానే చీకటి పడింది. మంగళవారం తవ్వి పరిశీలించనున్నారు. మృతులు తమిళనాడు తంజావూరుకు చెందిన వారుగా భావిస్తున్నారు. తంజావూరుకు చెందిన కళైసెల్వన్ అనే మానసిక వైద్యుని వద్ద మేలో చికిత్స తీసుకున్న ప్రిస్క్రిప్షన్ సంఘటనా స్థలంఓ లభించింది. అంతకుమించి ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని పోలీసులు తెలిపారు. మహిళ, పురుషుడి నోట్లో గుడ్డలు, గ్లౌజులు కుక్కి, నోటికి ప్లాస్టర్ వేసి ఉంది. ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తీసుకొచ్చి చెట్టుకు ఉరివేశారా, ఇక్కడే చంపేశారా అనేది మిస్టరీగా ఉంది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

'ఎర్ర' స్మగ్లర్ అరెస్టు : 21 దుంగలు స్వాధీనం



మంగళం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టీఎన్‌పాళెం అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయి గిరిధర్ ఆధ్వర్యంలో విష్ణుకుమార్ బృందం అటవీ సిబ్బంది చైతన్యకిషోర్‌తో కలిసి కూంబింగ్ నిర్వహించారు. టీఎన్‌పాళెం సమీపంలోని షాపింగ్‌మాల్ వెనుక వైపు కొందరు మూడు కార్లలో దుంగలు లోడ్‌చేస్తుండగా వెళ్లారు. వీరిని చూసి వారు చూసి పారిపోగా.. వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. అతడు చిత్తూరు జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. 19 వేర్లు, రెండు దుంగలను, స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వెలవెలబోయిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



ఖాళీగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15: నిత్యం వినియోగదారులతో రద్దీగా ఉండే సబ్‌రిజిస్ట్రార్ కార్యాయలం సోమవారం బోసిపోయింది. దస్తావేజులు, రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి డ్యాకుమెంట్ రైటర్లు మూడు రోజులపాటు పెన్‌డౌన్ చేపట్టారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సుమారు 72 స్లాట్లు నమోదవుతాయి. డ్యాకుమెంట్ రైటర్ల పెన్‌డౌన్‌తో పాటు సర్వర్ నెమ్మదిగా ఉండడంతో ఆరు స్లాట్లు మాత్రమే జరిగినట్లు సిబ్బంది తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించండి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, నైట్ వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలను నిలుపుదల చేయాలన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతలు కల్పించాలని కోరారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బంధకి సాహెబ్, జోగి శివకుమార్, కొళ్లపూడి సుబ్బయ్య, ప్రసాద్, చంద్రయ్య, మణి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్‌షూటింగ్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభచాటిన విద్యార్థినులు

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రైఫిల్‌షూటింగ్ పోటీలకు గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో అండర్-14 బాలిక విభాగంలో తమ పాఠశాలకు చెందిన తేజస్వి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం, ఈప్సితశ్రీ జిల్లాస్థాయిలో మూడో స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో కోచ్ జయశంకర్, పీడీలు కరీముల్లా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

గూడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు భవన నిర్మాణ సంక్షేమ బోర్డులోని నిధులను ఇతర అవసరాలకు మళ్లించాయన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లైములను వెంటనే పరిష్కరించాలని, కార్మిక సంక్షేమ చట్టం నుంచి కార్మికులకు నిధులు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, మీరాబాయ్, రమేష్, సునీల్, వెంకటయ్య, మస్తాన్, రవీంద్ర, జిలానీ, పురుషోత్తం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా: జనసేన



సమావేశంలో జనసేన నాయకులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై వైసీపీ నాయకులు చర్చకు సిద్ధమా అని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ సవాల్ విసిరారు. సోమవారం స్థానిక జనసేన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను మానుకోవాలని, అసత్య ప్రచారాలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మోహన్, నాగార్జున, మనోజ్, కార్తీక్, మధు, సాయికిరణ్, శీను, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు

బాలాయపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని వెంకటగిరి డీఆర్‌వో సుహాసిని హెచ్చరించారు. సోమవారం మండలంలోని మన్నూరు, పల్లిపాడు గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజర్వు ఫారెస్ట్ భూముల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ప్రవేశించినా, భూములను ఆక్రమించిన చర్యలు తీసుకుంటామన్నారు. మన్నూరులో సర్వే నంబరు 92, పల్లిపాడులో సర్వే నంబరు 53, 54-20, 54-21, 55-2, 56-2, 59లోని భూములు అటవీశాఖ పరిధిలో ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాల్లో వన్య ప్రాణులను వేటాడటం, ఉచ్చులు వేయడం, విద్యుత్ తీగలు తీయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదర్శనీయుడు మోక్షగుండం

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నేటి ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈ రమణయ్య అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్లను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యుడు రియాజ్ అహ్మద్, గిరినాథ్, శ్రీనివాసులు, చైతన్య కుమార్, శ్రీనివాసులురెడ్డి, శీనయ్య, ఇలియాజ్ అహ్మద్, రమణయ్య, మురళీరెడ్డి, జగదీష్, రవిచంద్ర, సద్దార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీర్లను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

17న బాలాయపల్లి మండల మీట్

బాలాయపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 17వ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వినీల్ కుమార్ తెలిపారు. అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు, రేపు స్కూల్‌గేమ్స్

చిల్లకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళ, బుధవారాల్లో మండలస్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు హెచ్ఎం జ్యోతి తెలిపారు. డీవైఈవో సనత్ కుమార్, ఎంఈవో రఫూఫ్ ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్‌లో పోటీలను నిర్వహిస్తామని, ప్రతిభ చూపిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

స్టేడియం అభివృద్ధికి కృషి: పాశం



నూతనంగా నిర్మించిన గ్యాలరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, జిందాల్ కంపెనీ ప్రతినిధులు

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్టేడియంలో జిందాల్ కంపెనీ సహకారంతో నూతనంగా నిర్మించిన గ్యాలరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధికి నోచుకోకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడేవారన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, దాతల సహకారంలోరూ.50లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కలెక్టర్ నిధుల నుంచి రూ.17 లక్షలతో నూతన ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టడంతోపాటు దాతల సహకారంతో ఆధునాతన జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా జిందాల్ కంపెనీ సహకారంతో నూతన గ్యాలరీ, పెన్వర్ కంపెనీ సహకారంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శాప్ చైర్మన్ రవి నాయుడు సహకారంతో త్వరలోనే స్టేడియంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, రజినీకాంత్, సుమన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్, లవకుమార్, దీపక్ ఆకాష్, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్ కుమార్, పెంచలయ్య, జిందాల్ కంపెనీ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల అనుమతితోనే పనులు చేపట్టాలి



కౌన్సిలర్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ కటకం దీపిక

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఏ ప్రాంతంలో అయినా సరే తప్పనిసరిగా మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకొని పనులు చేపట్టాలని చైర్ పర్సన్ కటకం దీపిక స్పష్టం చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో చైర్ పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణాభివృద్ధికి సంబంధించిన 16 అంశాలతో కూడిన అజెండా గురించి చర్చించారు. 14 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే టేబుల్ అజెండాలో పొందుపరచిన నాలుగు అంశాలను ఆమోదించారు. మున్సిపాలిటీ పరిధిలో ఇష్టానుసారంగా రోడ్లు తవ్వేసి, అలాగే వదిలేస్తున్నారని, అందుకు కారకులైన గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ అధికారుల అనుమతులు తీసుకొని పనులు చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని చైర్ పర్సన్ అన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జడ్పీటీసీ ప్రిస్కిల్లా

పెళ్లకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా అన్నారు. సోమవారం చెంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో చెంబేడు, తాళ్వాయిపాడు, రోసనూరు ఉన్నత పాఠశాలలకు చెందిన బాలబాలికుల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో-2 మించల శంకరయ్య మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు, పీఈటీ మాధవయ్య, మల్లిక, అరుణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వాకాడు ఎంపీడీవోగా సాయిప్రసాద్



వాకాడు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఎంపీడీవోగా సాయిప్రసాద్ నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఉమామహేశ్వరరావు చిట్టమూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం నెల్లూరు జిల్లా పరిషత్ సీఈవో మోహన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు.

నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి జరిగే దేవీ నవరాత్రి ఉత్సవాలకు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డిని దేవదాయశాఖ సహాయ కమిషన్ ప్రసన్నలక్ష్మి ఆహ్వానించారు. సోమవారం మావిళ్ల పాడులోని ఆయన ఇంటికెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్య క్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

తడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సూళ్లూరుపేట - చెన్నై మార్గంలో అక్కంపేట రైల్వేస్టేషన్ సమీపంలో 74/29-31 కిలోమీటరు మధ్య సుమారు 45 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం పడి ఉందంటూ రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్‌పీ ఎస్‌ఐ చెన్నకేశవ తెలిపారు.

సూళ్లూరుపేటలో...

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ సమీపంలోని సాయినగర్ వద్ద రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు సమాచారం మేరకు... చెన్నై వైపు వెళ్లే రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండ వచ్చునని అనుమానునిస్తున్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. సిమెంట్ కలర్ చొక్కా, తెలుపు నీలిరంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్‌ఐ చెన్నకేశవ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

దక్కిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగవోలు, దేవునివెల్లంపల్లి గ్రామాల్లో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువైద్య శాస్త్రవేత్త శ్రీహరి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెల 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పశువులకు తీవ్రజ్వరం, నోటి నుంచి చొంగ కారడం, నోరు, కాలిగిట్ల మధ్య పుండ్లు, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం వంటివి గాలికుంటు వ్యాధి లక్షణాలు, దీనివల్ల పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో మాధవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పశువైద్యాధికారి శ్రీహరి, సహాయ సంచాలకుడు కిశోర్‌కుమార్, పశువైద్య సహాయ శాస్త్రవేత్త రాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించండి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని నెల్లటూరు, కొండాగుంట, తిప్పవరప్పాడు గ్రామాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. నెలరోజుల పాటు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలని అర్బన్ సీఐ బాబి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని చలివేంద్ర వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.

జీతాలు చెల్లించాలని ధర్నా

తడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటూ కార్మికులు సోమవారం ధర్నాకు దిగారు. తడ మండలం మాంబట్టు సెజ్‌లోని ఇమ్ఫీలూమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఈ ఏడాది జూన్ నుంచి కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదు. పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం సాయంత్రం కార్మికులు గేట్ ముందు ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకుని యాజమాన్యంతో చర్చించారు. నెలాఖరులోగా బకాయిలను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించి విధులకు హాజరయ్యారు.

అదుపుతప్పి బస్‌షెల్టర్‌ను ఢీకొన్న బస్సు

గూడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మనేటూరు గ్రామ సమీపంలో సోమవారం ఓ ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తృటిలో తప్పింది. స్థానికుల వివరాల మేరకు... వెంకటగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గూడూరు నుంచి వెంకటగిరికి ప్రయాణికులతో వెళుతుండగా కొమ్మనేటూరు సమీపంలో అకస్మాత్తుగా మోటారు సైకిల్ అడ్డురావడంతో దాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బస్‌షెల్టర్‌ను, దుకాణాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. బస్సు ముందుభాగం దెబ్బతింది.

ఉపాధ్యాయుల నిరసన

వెంకటగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయడంతో పాటు కొత్త పీఆర్సీని నియమించి ఐఆర్ ప్రకటించాలని కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ సుశీలమ్మకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిరామ్, సుబ్రహ్మణ్యం, కృష్ణ, భాస్కర్ యాదవ్, రామసుబ్బయ్య, నాగమోహన్, గౌస్ భాషా తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 33 మందికి సీఎం సహాయనిధి నుంచి రూ.21.38 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

ప్రహరీ కూల్చివేత దారుణం

కోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కర్లపూడి దళితవాడలో వైసీపీ ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర ఇంటి ప్రహరీని దౌర్జన్యంగా కూల్చివేయడం దారుణమని ఆ పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సురేంద్ర పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున ఓర్వలేక స్థానికంగా ఉన్న కొంత మంది నాయకులు ఆయన ఇంటి ప్రహరీని అక్రమంగా కూల్చివేయడం దుర్మార్గమన్నారు. సురేంద్ర కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉండగా ఉంటుందని సంపత్‌కుమార్‌రెడ్డి అన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఇంజనీర్స్ డే



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు

కోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు టెక్నికల్ క్విజ్, పోస్టల్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

దారి అక్రమణపై చర్యలు తీసుకోవాలి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి మందిరానికి వెళ్లే దారి ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సత్యసాయి స్పిరిచువల్ సొసైటీ సభ్యులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక కుమ్మర వీధిలోని సత్యసాయిబాబా మందిరానికి వెళ్లే మార్గాన్ని కొందరు ఆక్రమించుకుని ఆటకం కలిగిస్తున్నారని, పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటసురేష్, దాము, ప్రతాప్, ఆనంద్, మల్లికార్జున్‌రావు, శేషగిరిరావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక వేడుకలు

తడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వాటంబేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక వేడుకలు సోమవారం మొదలయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో సోమవారం కలశస్థాపన, పూర్ణాహుతి నిర్వహించారు. బుధవారం కుంభాభిషేకం జరగనుంది.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలో తడ - సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ల మధ్య ఇంజనీరింగ్ పనుల కారణంగా మంగళవారం నెల్లూరుకు వెళ్లే మెమూ రైలును రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి 1.10నుంచి మంగళవారం ఉదయం 9.10 వరకు పనులు చేపట్టనున్నారు. ఈ సమయంలో ఆమార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేశారు.

రద్దు చేసిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 7.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66035
- నెల్లూరు నుంచి ఉదయం 10.20 నిమిషాలకు బయలుదేరి సూళ్లూరుపేటకు వచ్చే మెమూ రైలు నెంబరు 66036
- చెన్నై మోర్ మార్కెట్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5.40 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66029
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.35 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66030
- ఆవడి నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 4.25 గంటలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66000

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు

మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 4.15 నిమిషాలకు, 5 గంటలకు బయలుదేరి వచ్చే ఈఎంయూ లోక్ రైళ్లను ఎలావూరు సూళ్లూరుపేట మధ్య రద్దు చేశారు.

- సూళ్లూరుపేట నుంచి మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 6.45 నిమిషాలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైలును సూళ్లూరుపేట- ఎలావూరు మధ్య రద్దు చేశారు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై బీచ్‌కు ఉదయం 7.25 నిమిషాలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైలును సూళ్లూరుపేట ఎలావూరు మధ్య రద్దు చేశారు. అదేవిధంగా మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు కొంత ఆలస్యంగా నడవనున్నాయి.

వైసీపీ నేతలకు సీఎంను విమర్శించే అర్హత లేదు

గూడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడును విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలకు తావులేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రౌడీయిజాన్ని ప్రోత్సహించి అనేక అక్రమాలకు పాల్పడ్డారని, అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఆదివారం చిల్లకూరు మండలంలోని మోమిడి గ్రామంలో వైసీపీకి చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలను సునీల్ కుమార్ ఖండించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు రాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులతో కోచ్ పవన్‌కుమార్

నాయుడుపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఇందుకూరుపేటలో ఆదివారం జరిగిన తైక్వాండో పోటీల్లో నాయుడుపేట క్రీడాకారులు ప్రతిభ కనబరచినట్లు తైక్వాండో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉయ్యాల పవన్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు తైక్వాండో పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో నాయుడుపేట నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, ఎస్‌కే అల్తాఫ్, విజయ ఆనంద్, ఆంజనేయులు, లక్ష్మీప్రభ, నవీన్‌కుమార్, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు భూములివ్వండి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భూమిలేని గిరిజనులకు భూములివ్వాలని ఏపీ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన నాయకుడు బాలయ్య మాట్లాడుతూ దొరవారిసత్రం మండలం కొత్తపాలెం గ్రామంలోని ప్రభుత్వ భూములను స్థానిక గిరిజనులకు మాత్రమే ఇవ్వాలన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

కోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లూరుపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యాబోధనపై ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.